ప్రజాశక్తి

ఆదివారం 18 మే 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా





పడమర దిశగా రాజధాని విస్తరణ !

- కొత్తగా భూ సమీకరణకు గ్రామాల ఎంపికపై కసరత్తు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని విస్తరణపై ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. రాజధాని అవసరాలకు అదనంగా 44 వేల ఎకరాల సమీకరణకు అధికారులు అంతర్గత ప్రణాళికలు రూపొందిస్తున్నారు. తూర్పుదిశలో ఉన్న రాజధాని విస్తరణ అంతా పడమర వైపునకు వెళ్తోంది. తూర్పులో ఉన్న ఎన్‌టిఆర్ జిల్లాలో ఎటువంటి భూ సమీకరణపై దృష్టిసారించడం లేదు. గుంటూరు జిల్లా పడమర ప్రాంతంలోని అమరావతి, తాడికొండ, పెదకాకాని, మంగళగిరి, పెదకూరపాడు మండలాల వైపు ఎక్కువగా దృష్టి కేంద్రీకరిస్తోంది. అమరావతి మండలంలో తొలుత ఐదు గ్రామాలకు పరిమితం అవుతుందని భావించిన భూ సమీకరణ తాజాగా మరో 10 గ్రామాలనూ ఎంపిక చేసినట్లు తాజా సమాచారం. మొత్తం 32 వేల ఎకరాలను అమరావతి మండలంలోనే తీసుకోనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఎంపిక చేసిన వైకుంఠపురం, పెదమద్దూరు, కర్లపూడి, యండ్రాయి తదితర గ్రామాల్లో గ్రామసభలను అధికారులు పూర్తి చేశారు. తాజాగా అమరావతి మండలంలో అమరావతి, ధరణికోట, ఉంగుటూరు, నెమలికల్లు, మండేపూడి, నరుకుళ్లపాడు, లింగాపురం, ముత్తాయపాలెం, దిడుగు, పొందుగల, పెదకూరపాడు మండలం బలుసుపాడు, కంభం తదితర గ్రామాలను కూడా ఎంపిక చేసినట్లు తెలిసింది.

2015లో నిర్వహించిన భూ సమీకరణలో మినహాయించిన వడ్డమాను, పెదపరిమి, హరిశ్చంద్రపురం గ్రామాలను కూడా తాజాగా ఎంపిక చేశారు. మరోవైపు రైల్వే లైను, విమానాశ్రయం, పారిశ్రామిక అవసరాల పేరుతో 44వేల ఎకరాల సమీకరణకు తాడికొండ మండలాన్ని కూడా ఎంపిక చేయడంతో ఈ మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే పలువురు ప్రముఖులు తక్కువ ధరకు భూములను కొనుగోలు చేశారు. ప్రధానంగా తాడికొండ మండలం బండారుపల్లి, పాములపాడు, రావెల, పొన్నేకల్లు ప్రాంతంలో విమానాశ్రయం, రైల్వే ట్రాక్ వస్తుందన్న సమాచారంతో సమీకరణలో భూములు ఇస్తే రాజధానిలో ఎక్కువ విలువైన రిటర్నబుల్ ప్లాట్లు వస్తాయన్న ఆశతో పలువురు అతి తక్కువ ధరకు ఉన్న భూములను కొనుగోలు చేశారు. తాడికొండ ప్రాంతంలో ఇప్పటికే భారీగా ధరలు పెరిగి ఉండటంతో ఎక్కువ మంది రైతులు సమీకరణలో భూములు ఇచ్చేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం తాడికొండలో పరిమితంగా సమీకరణ చేసి అమరావతి మండలం వైపు దృష్టి సారించింది.



అయితే రాజధాని అమరావతిలో 10 ఏళ్ల క్రితం ఇచ్చిన భూములకే ఇంతవరకు రిటర్నబుల్ ప్లాట్లు తమ చేతికి అందలేదని, ఈదశలో మరో విడత సమీకరణలో భూములు ఇస్తే ఎప్పటికి తమకు దక్కుతాయన్న ఆందోళన అమరావతి, తాడికొండ మండలాల రైతుల్లో నెలకొంది. రాజధాని విస్తరణ ప్రతిపాదనపై అధికారిక ప్రకటన కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. రాజధాని పరిసర మండలాల్లో భూ సమీకరణ చేయడం వల్ల తమ భూముల ధరలు తగ్గుతాయని, తాము ఇప్పట్లో విక్రయించుకోలేమని మొదటి విడత భూ సమీకరణలో భూములిచ్చిన 29 గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం, రైల్వేలైను, వాణిజ్య అవసరాలు, తక్కువ ధరకు పారిశ్రామిక వేత్తలకు భూములు ఇచ్చేందుకు కేవలం 10 వేల ఎకరాలు తక్షణం అవసరం అని మంత్రి నారాయణ ఇటీవల ప్రకటించారు. దీంతో ఏ ప్రాంతంలో ఎంత భూమి తీసుకుంటారో.. ఏయే గ్రామాలను అధికారికంగా ఎంపిక చేస్తారో తెలియక తాడికొండ, అమరావతి, పెదకాకాని తదితర మండలాల రైతులు ఆందోళన చెందుతున్నారు.



స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి వియంసి కమిషనర్ ధ్యానచంద్ర, ఎంఎల్ఎ బొండా ఉమా తదితరులు

చెట్లను పెంచుదాం.. ఎండ వేడిమిని అధిగమిద్దాం

జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి

ప్రజాశక్తి - విజయవాడ : స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర విజయవంతంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, పచ్చదనానికి ప్రాధాన్యతానిచ్చి చెట్లను పెంచడం ద్వారా ఎండ వేడిమిని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని భూ పరిపాలన చీఫ్ కమిషనర్ (సీసీఎల్‌ఏ) ఎన్‌టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి అన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో "బీట్ ద హీట్" నినాదంతో సత్యనారాయణపూరం సర్కిల్–2 కార్యాలయం వద్ద నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమానికి జయలక్ష్మి ముఖ్య అతిధిగా హాజరై స్వచ్ఛత కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమాల విజయవంతంలో ప్రజల భాగస్వామ్యం కీలకమన్నారు. ప్రభుత్వపరంగా చేపట్టిన కార్యక్రమాలపై ప్రజలను చైతన్యవంతులను చేసి వాటిని విజయవంతం చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాలను చేరుకోగలమన్నారు. ఎండ వేడిని అధికమించేందుకు మొక్కలను నాటి సంరక్షించడమే ఏకైక మార్గం అన్నారు. సాధారణంగా పట్టణాలలో ఎక్కువ శాతం భూమి కాంక్రీట్‌తో కప్పబడి ఉంటున్న కారణంగా మొక్కలు పెరిగే అవకాశం చాలా తక్కువగా ఉంటుందన్నారు. అందువల్ల పట్టణ ప్రాంతంలోని ప్రజలు అధిక వేడిమి బారిన పడతారన్నారు. దీనిని అధికమించేందుకు ప్రభుత్వ స్థలాలతోపాటు ప్రైవేట్ స్థలాలో కూడా మొక్కలను నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈకార్యక్రమంలో సెంట్రల్ ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు, వియంసి కమిషనర్ హెచ్ ఎం ధ్యాన చంద్ర ఆర్‌డివో కె. చైతన్య, అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట డా. డి. చంద్ర శేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్ శ్రీనాథ్‌రెడ్డి, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా. గోపాలకృష్ణ, నాయక్, జెడి అమృత, జోనల్ కమిషనర్ కె. ప్రభుదాస్ పాల్గొన్నారు.

భారీ వర్షంతో నేలరాలిన మామిడి

తడిసిన ధాన్యం

ప్రజాశక్తి - నందిగామ : ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ మండలంలో శనివారం రాత్రి గాలి దుమారం, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. వేసవికాలంలో అకాల వర్షాలకు రైతులు నష్టపోతున్నారు. ముఖ్యంగా కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి తడిసిపోతోంది. నందిగామ మండలం ఐతవరం గ్రామంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం తెల్లవారు జామున కురిసిన అకాల వర్షాలకు నందిగామ మండలం కంచల, ఐతవరం, కమ్మవారిపాలెం, రాఘవాపురం తదితర గ్రామాలతోపాటు పలుచోట్ల తోటల్లో మామిడి కాయలు నేలరాలాయి. దీంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అకాల వర్షాల వల్ల వేసవికాలంలో ప్రజలు కొంత ఉపశమనం పొందినప్పటికీ పగలు ఎండ తీవ్రత మరింత పెరిగి ఉక్కపోతకు గురవుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నందిగామలో నేల రాలిన మామిడి పండ్లు

నేడు 'సంఘం శరణం గచ్చామి' ప్రదర్శన

ప్రజాశక్తి - విజయవాడ

కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక సాంస్కృతిక చైతన్య యాత్రల ముగింపు సందర్భంగా విజయవాడ బందరు రోడ్డులోని రాఘవయ్యాపార్కు వద్దగల మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె) ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవిత ఘట్టాలతో కూడిన 'సంఘం శరణం గచ్చామి' నాటకం ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కెవిపిఎస్ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి జి.నటరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు, మహిళలు కుటుంబాలతో సహా వచ్చి నవయుగ అంబేద్కర్ చరిత్రను కళ్లారా వీక్షించాలని విజ్ఞప్తి చేశారు. యువతీ యువకులు, విద్యార్థులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.



హైదరాబాద్‌లో ఎంఎల్ఎ సుజనా చౌదరిని పరామర్శిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

ఎంఎల్ఎ సుజనాకు సిఎం పరామర్శ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు సుజనా చౌదరిని పరామర్శించారు. ఇటీవల లండన్ పర్యటనలో ప్రమాదవశాత్తూ గాయపడిన ఆయన కుడి భుజానికి శస్త్ర చికిత్స జరిగింది. దీంతో వైద్యుల సూచనల మేరకు సుజనా విశ్రాంతి తీసుకుంటున్నారు. హైదరాబాదులోని సుజనా చౌదరి నివాసానికి వెళ్లి సిఎం చంద్రబాబు ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని, యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సుజనా చౌదరి త్వరగా కోలుకొని తిరిగి ప్రజా సేవకు పునరంకితం కావాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.



సిబ్బంది ఆరోగ్యానికి ప్రాధాన్యత

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ సిబ్బంది ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. జాతీయ హైపర్ టెన్షన్ డే సందర్భంగా శనివారం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో విఎంసి సిబ్బందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని కోరారు.

ఏప్రాణీ వేసవి తాపానికి గురికాకూడదు : ఎంఎల్ఎ గద్దె

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఏప్రాణీ వేసవి తాపానికి గురి కాకూడదని విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎంఎల్ఎ గద్దె రామమోహనరావు అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో కూడా సర్కిల్ 3 స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆటోనగర్‌లో బీట్ ద హీట్ అనే అంశంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కేవలం మనుషులు మాత్రమే కాకుండా మనతో సమాజంలో జీవించే పక్షులకు, జంతువులకు కూడా ఎటువంటి వేడి తాపం తగలకుండా ఉండేందుకు మంచినీటి సౌకర్యాలను విజయవాడ నగరపాలక సంస్థ కల్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మమ్మీనేని ప్రసాద్, జోనల్ కమిషనర్ కే షమీ, సిబ్బంది పాల్గొన్నారు.



పక్షులకు మంచినీటి సౌకర్యాన్ని అందుబాటులో ఉంచుతున్న ఎంఎల్ఎ గద్దె రామమోహనరావు

మార్పు ద్వారానే పర్యావరణ పరిరక్షణ

కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

ప్రతి నెలా ప్రత్యేక థీమ్‌తో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

ప్రజాశక్తి - జి.కొండూరు : పర్యావరణ హిత క్రమశిక్షణ, సమాజంపై బాధ్యతగా మన నుంచే మార్పు మొదలవ్వాలని, మనం వేసే ఒక చిన్న అడుగు, పెద్ద విజయానికి దారితీస్తుందని, అన్నింటా స్వచ్ఛత మెరుగైన జీవితానికి బాసటగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శనివారం జి.కొండూరు ఓల్డ్ శివసాయి హెూటల్ సమీపంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర (ఎస్ఏఎస్ఏ) కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సంపన్నమైన, ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన ఆంధ్ర లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర ఏ 2047 దార్శనిక పత్రంలోని పది సూత్రాల్లో సమగ్ర విధానాలతో స్వచ్ఛాంధ్ర అనేది ఒక సూత్రంగా ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రతి నెలా మూడో శనివారం ఒక ప్రత్యేక థీమ్‌తో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల బీట్ ది హీట్ ఇతివృత్తంతో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రతిఒక్కరూ పర్యావరణం, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని.. తప్పనిసరి పరిస్థితుల్లో విస్తత ప్రజాప్రయోజన అభివద్ధి కార్యక్రమం కోసం ఒక చెట్టును నరకడం తప్పనిసరైతే పది మొక్కలు నాటాలని సూచించారు. హరిత విస్తీర్ణాన్ని పెంచడం వల్ల మనకు, భావితరాలకు ఆరోగ్యకర జీవితం సొంతమవుతుందని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు.

వేసవి తాపాన్ని తట్టుకునేలా:

ప్రజలు వేసవి తాపాన్ని తట్టుకునేందుకు వీలుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములవుతున్నారన్నారు. చలివేంద్రాల ఏర్పాటు, అన్ని కార్యాలయాల్లో మంచి నీటి సౌకర్యం ఉండేలా చూడటం, ఇంకుడు గుంతలు, నీటి



మొక్కలు నాటుతున్న కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

రీఛార్జ్ నిర్మాణాలు తదితరాలపై ప్రత్యేకంగా దష్టిసారిస్తున్నామన్నారు. వడదెబ్బ నుంచి రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు ఒకవేళ వడదెబ్బకు గురైతే తీసుకోవాల్సిన ప్రాథమిక చికిత్స చర్యల గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. చిన్నారులకు బీట్ ది హీట్‌పై డ్రాయింగ్, వ్యాస రచన తదితర పోటీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యాలయాలు, భవనాల టెర్రాస్‌పై సోలార్ రిఫ్లెక్టివ్ వైట్ పెయింట్స్ వేయించి వేడిని తగ్గించే చర్యలను సూచిస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ శ్రామికులు ఉదయం త్వరగా మొదలు పెట్టి పనులు పూర్తయ్యేలా చూస్తున్నామని.. పని ప్రదేశంలో నీటి సౌకర్యం ఉండేలా చూడటంతో పాటు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించజడం జరుగుతోందన్నారు. మనుషులతో పాటు పశుపక్ష్యాదులకు నీటి తొట్లు, మట్టి పాత్రలు ఏర్పాటుచేసి తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు తెలిపారు. నీటిని వథా చేయకుండా జాగ్రత్తగా వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ లక్ష్మీశ.. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి.సుబ్బారావు, చెవుటూరు గ్రామ సర్పంచి పి.శ్రీదేవి, డీపీవో పి.లావణ్య కుమారి, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, డ్వామా పీడీ ఎ.రాము, తహసీల్దార్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో బీవీ రామకష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువుల గుంతలపై అవగాహన కల్పించండి

పారిశుధ్యం సమస్యకు చెక్ పెట్టేందుకు, మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు దోహదం చేసే సేంద్రీయ ఎరువుల గుంతల (కంపోస్ట్ పిట్)పై పెద్దఎత్తున ప్రజలకు అవగాహన కల్పించాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. శనివారం జి.కొండూరులో సేంద్రియ ఎరువుల గుంతల తవ్వకం కార్యక్రమాన్ని ఆయన... అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం అనుసంధానంతో సేంద్రీయ ఎరువుల గుంతలను ప్రజలు ఎలాంటి ఖర్చు లేకుండా ఏర్పాటు చేసుకోవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఎ.రాము, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, డీపీవో పి.లావణ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

గుంతను పరిశీలిస్తున్న కలెక్టర్ జి.లక్ష్మీశ



ఐదు విఎంసి ప్రత్యేక కమిటీల ఎన్నిక పూర్తి

ప్రజాఫిర్యాదుల కమిటీ చైర్మన్‌గా సత్యనారాయణమూర్తి

వైస్ చైర్మన్‌గా చెన్నుపాటి ఉషారాణి

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థలోని పలు ప్రత్యేక కమిటీల చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యుల ఎన్నిక జరిగింది. ప్రజాఫిర్యాదుల ప్రత్యేక కమిటీ చైర్మన్‌గా వల్లూరి ఎన్‌డిఎస్ సత్యనారాయణమూర్తి, వైస్ చైర్మన్‌గా చెన్నుపాటి ఉషారాణి, కమిటీ సభ్యులుగా బాలాసాని మణెమ్మ, పడిగపాటి చైతన్యరెడ్డి, మైలవరపురత్నకుమారి, యలకల చలపతిరావు, ఇసరపు దేవి, మొహమ్మద్ షహీనా సుల్తానా, ఉమ్మడి రమాదేవి, కంచిదుర్గ, తాటిపర్తి కొండారెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులుగా టిపరమల్లి జమలపూర్ణమ్మ (కో-ఆప్షన్ సభ్యులు) ఎన్నికయ్యారు. అలాగే లైటింగ్, పార్కుల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా కుక్కల అనిత, వైఎస్ చైర్మన్ తంగిరాల రామిరెడ్డి, కమిటీ సభ్యులుగా నెలిబండ్ల బాలస్వామి, జాస్తి సాంబశివరావు, వియ్యపు అమర్నాద్, ముమ్మనేని వెంకట ప్రసాద్, కొంగితల లక్ష్మీపతి, పెనుమత్స శిరీష, బండి శివశక్తి నాగేంద్రపుణ్యశీల, బాలిగోవిందు, మహదేవు అప్పాజీరావు, ప్రత్యేక ఆహ్వానితులుగా నందెపు జగదీష్ (కోఆప్షన్ సభ్యులు) ఎన్నికయ్యారు. రోడ్లు, డ్రైయిన్లు , భవన నిర్మాణాల ప్రత్యేక కమిటీ చైర్మన్‌గా కంచిదుర్గ, వైస్ చైర్మన్‌గా మండేపూడి చటర్జీ, కమిటీ సభ్యులుగా వల్లభనేని రాజేశ్వరి, మొహమ్మద్ ఇర్ఫాన్, కలపాల అంబేద్కర్, జాస్తి సాంబశివరావు, అంబడిపూడి నిర్మలకుమారి, నెలిబండ్ల బాలస్వామి, బోయి సత్యబాబు, గుడివాడ నరేంద్ర రాఘవ, ప్రత్యేక ఆహ్వానితులుగా ముసునూరు సుబ్బారావు (కోఆప్షన్) ఎన్నికయ్యారు. మహిళా అభ్యుదయ ప్రత్యేక కమిటీ చైర్మన్‌గా యర్రగొర్ల తిరుపతమ్మ, వైస్ చైర్మన్‌గా మురిపిళ్ల రాజేష్, సభ్యులుగా ఉద్దంటి సునీత, దేవినేని అపర్ణ, పుప్పాల నరసకుమారి, బంకా శకుంతలాదేవి, వీరమాచినేని లలిత, భీమిరెడ్డి శివ వెంకట జానారెడ్డి, మైలవరపు మాధురీలావణ్య, ఇసరపు దేవి, ప్రత్యేక ఆహ్వానితులుగా టి జమలపూర్ణమ్మ (కోఆప్షన్) ఉన్నారు. మురికివాడల అభివృద్ధి ప్రత్యేక కమిటీ చైర్మన్‌గా శీలంశెట్టి పూర్ణచంద్రరావు, వైస్ చైర్మన్‌గా అలంపూరి విజయలక్ష్మీ, కమిటీ సభ్యులుగా చింతల సాంబశివరావు, ఉమ్మడిశెట్టి రాధిక, మొహమ్మద్ రెహనా నాహిద్, పుప్పాల నరసకుమారి, వల్లూరి ఎన్‌డిఎస్ సత్యనారాయణమూర్తి, గుడివాడ నరేంద్ర రాఘవ, పడిగపాటి చైతన్యరెడ్డి, మోదుగుల తిరుపతమ్మ, ముమ్మనేని వెంకట ప్రసాద్, ప్రత్యేక ఆహ్వానితులగా జి సుభాషిణి (కోఆప్షన్) ఎన్నికయ్యారు. శనివారం జరిగిన ఐదు ప్రత్యేక కమిటీల ఎన్నికల్లో అన్ని పార్టీల కార్పొరేటర్లకు ప్రాతినిధ్యం కల్పించారు. ఈ ఎన్నిలను విఎంసి సెక్రటరీ కె వసంతలక్ష్మీ నిర్వహించారు.



లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు

ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): స్కానింగ్ కేంద్రాలలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, దీనిని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ గీతాంజలి శర్మ హెచ్చరించారు.శనివారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రీ కన్సెప్షన్ అండ్ ప్రీ నాటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ (పిసిపిఎన్డిటి) చట్టంపై జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆరవ అదనపు జిల్లా జడ్జి పి పాండురంగారెడ్డితో కలసి స్కానింగ్ కేంద్రాల దరఖాస్తుదారుల పత్రాలను పరిశీలించి అధికారుల నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉన్న జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలలో పక్కా నిఘా ఉంచి తనిఖీలు నిర్వహించాలన్నారు. స్కానింగ్ కేంద్రాలలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారిపై మాత్రమే కాకుండా అడిగినవారు ,ప్రోత్సహించిన వారిపై సైతం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



మాట్లాడుతున్న జడ్జి పాంగునంగారెడ్డి, ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ,

ఆరవ అదనపు జిల్లా జడ్జి పి పాండురంగారెడ్డి జిల్లా జనాభాలో స్త్రీ పురుష లింగ నిష్పత్తుల గణాంకాలపై అధికారులను ఆరా తీశారు. స్త్రీ పురుష లింగ నిష్పత్తులలో వ్యత్యాసం లేకుండా క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ప్రస్తుతం జిల్లాలో రిజిస్ట్రేషన్ కలిగిన స్కానింగ్ కేంద్రాలు మొత్తం 89 ఉండగా, వాటిలో 17 ప్రభుత్వ, 72 ప్రైవేట్ స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం కొత్తగా స్కానింగ్ రిజిస్ట్రేషన్ కోసం ఐదు, పునరుద్ధరణ (రెన్యువల్) కోసం మూడు, రద్దు (క్యాన్సిలేషన్) కోసం ఒకరు దరఖాస్తు చేసుకున్నారని డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ఠ వివరించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ధర్మతేజ, పి వెంకటేశ్వరరావు, జిల్లా విద్యా మాస్ మీడియా అధికారి సిహెచ్ వాణిశ్రీ పాల్గొన్నారు.




'పేర్నికి కొల్లును విమర్శించే అర్హత లేదు'

ప్రజాశక్తి-అవనిగడ్డ: పేదల బియ్యం మెక్కిన పేర్ని నానికి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రను విమర్శించే అర్హత ఎక్కడదని అవనిగడ్డ నియోజకవర్గం టిడిపి నాయకులు విమర్శించారు. శనివారం నియోజకవర్గ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేర్ని నాని శుక్రవారం చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. కొల్లు రవీంద్ర బలహీన వర్గాల నుంచి ఎదిగిన మచ్చలేని నేత అని అన్నారు. 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసే అందరి మన్ననలు పొందారని, ఒక్క అవినీతి మచ్చ లేకుండా తన బాధ్యతలు నెరవేర్చిన ఆయనకు కూటమి ప్రభుత్వంలోనూ మంత్రిగా అవకాశం కల్పించారని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు విశ్వనాథపల్లి పాప, బండే రాఘవ, మాదివాడ రత్నారావు, మేడికొండ విజయ్, గుంటూరు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి పంపిణీ

ప్రజాశక్తి-గుడివాడ : సీఎం సహాయనిధితో పేద, బడుగు, బలహీన వర్గాల వారికి మెరుగైన వైద్యం అందుతుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడివాడ ఏలూరు రోడ్డులోని టిడిపి కార్యాలయం ప్రజా వేదికలో గుడివాడ నియోజకవర్గ పరిధిలోని బాధిత కుటుంబాలకు 30 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి సిఫార్సు పత్రాలను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం అందచేశారు. ఈ సందర్భంగా బాధితుల ఆరోగ్య సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గడిచిన 11 నెలల కాలంలో గుడివాడ నియోజకవర్గ పరిధిలో బాధిత కుటుంబాలకు కోటిన్నర సీఎం సహాయనిధి చెక్కులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, నందివాడ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, టిడిపి నాయకులు పంద్రాజు సాంబయ్య, షేక్ ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రాము

ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయండి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): రాష్ట్రంలో విద్యాశాఖ చేపట్టబోయే ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ ప్రజాస్వామ్య యుతంగా జరిగి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్ది బాబు రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు కోరారు. ఉన్నత పాఠశాలలో తరగతికి 45 మంది విద్యార్థులు కంటే ఎక్కువ ఉంటే రెండో సెక్షన్ మంజూరు చేయటం ద్వారా విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధకు అవకాశం ఉంటుందని తెలిపారు .ఇంగ్లీష్ మీడియం లో చదవలేని వారికి తెలుగు మీడియంలో చదువుకునే అవకాశం కల్పించడం ద్వారా డ్రాప్అవుట్ రేటు తగ్గించవచ్చన్నారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా స్కూల్ అసిస్టెంట్లను నియమించటం వల్ల మానవ వనరులు వధా అయ్యే ప్రమాదం ఉందని, సెకండరీ గ్రేడ్ టీచర్లను పదోన్నతులతో ఆయా పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా నియమించటం ఉపయుక్తమని పేర్కొన్నారు.ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులకు భారత రాజ్యాంగం స్ఫూర్తితో కల్పించబడిన ఉన్నత చదువుల అవకాశాలను విఘాతం కలిగేలా స్టడీ లీవ్ కి వెళ్లిన ఉపాధ్యాయుల పోస్టులను క్లియర్ వేకెన్సీగా చూపించడం ఉందని క్లియర్ వేకెన్సీ గా స్టడీ లీవ్ ఉపాధ్యాయుల పోస్టులను మినహాయించే చర్యలు తీసుకొని రాజ్యాంగబద్ధ హక్కును కాపాడవలసిన బాధ్యత విద్యాశాఖపై ఉందన్నారు. ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తి కనీసం 20కు తగ్గకుండా చూడవలసిందిగా కోరారు. సెకండరీ గ్రేడ్ టీచర్లకి వేల కొలది ఐచ్ఛికాలు ఆన్లైన్లో నమోదు చేయటం కష్టమవుతున్నందున వారికి ఆన్లైన్ తో కూడిన మాన్యువల్ కౌన్సిలింగ్‌ను జరపటం తదితర చర్యల ద్వారా బదిలీలు, ప్రమోషన్లతో ప్రభుత్వ విద్యారంగాన్ని బలపరచాలని కోరారు.

పోలీసులు వస్తున్నారని నదిలో దూకి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేయడానికి వస్తున్నారని, తప్పించుకునేందుకు నదిలో దూకిన వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఘటన శనివారం చోటుచేసుకుంది. తోట్లవల్లూరు మండలం రొయ్యూరు లంకలో కృష్ణానది పాయ సమీపంలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో దాడి చేయడానికి తోట్లవల్లూరు పోలీసులు వెళ్లారు. పోలీసులు వస్తున్నారనే సమాచారంతో కంకిపాడు మండలం మద్దూరుకు చెందిన తొమ్మిది మంది పరారయ్యారు. వల్లభనేని గోపాలం (35)తో పాటు వడుగు వెంకటేశ్వరరావు కృష్ణానదిలో దూకి తప్పించుకోవాలనే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నంలో గోపాలం నీటిలో మునిగి మృతిచెందాడు. వెంకటేశ్వరరావు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్దూరు గ్రామస్తులు తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్ వద్ద మతుని కుటుంబానికి న్యాయం చేయాలని నిరసనకు దిగారు.



హత్య కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-గన్నవరం (హనుమాన్ జంక్షన్): ఈ నెల 14 వ తేదీ రాత్రి బాపులపాడు మండలం సిరివాడ గ్రామములో జరిగిన తలారి మేరీ ఫ్లోరెన్స్ హత్య కేసులో నిందితులు కనకవల్లి సుందరం అతనికి సహకరించిన తలారి ప్రశాంతి అలియాస్ సోనిలను శనివారం అరెస్టు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. నిందితులను వేలేరు అడ్డరోడ్డు వద్ద అరెస్టు చేశామని, రిమాండు నిమిత్తం నూజివీడు కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-మొవ్వ: రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షులు, మొవ్వ మండల అధ్యక్షులు లైన్స్ క్లబ్ మెంబర్ (మాజీ అధ్యక్షులు) బెల్లంకొండ వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు పెదపూడి ఆయన స్వగ్రామంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవిని వైద్యాలయంలో రోగులకు పండ్లు పంచారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కోనేరు మంజునాథ్, సంజీవిని హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జొన్నలగడ్డ హనుమకుమార్, కొండవీటి అమరబాలేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ దోనేపూడి శివరామయ్య పాల్గొన్నారు.





గోడపత్రికను విడుదల చేస్తున్న ఉద్యోగులు

5న కౌన్సిల్ సమావేశానికి తరలిరావాలి

ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): వచ్చే నెల 5వ తేదీన విజయవాడలో జరగబోయే ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి కృష్ణాజిల్లాలో ఉద్యోగులందరూ వేలాదిగా తరలి రావాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రాము, తోట ప్రసాద్ పిలుపు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్రఅధ్యక్షులు కామ్రేడ్ కె.ఆర్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరగనున్న ఈ సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొనున్నారని చెప్పారు. ఈ సమావేశానికి సంబంధించి గోడ పత్రికను శనివారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ ఆవరణలో సంఘ నాయకులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి పరిష్కరించే లక్ష్యంతో ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సురేష్ నాయక్, ట్రెజరర్, వైస్ ప్రెసిడెంట్‌లు జి.శ్రీనివాస్, పవన్ కుమార్, యం.రాంప్రసాద్, బాలాజీ, ప్రసాద్, లోకేష్, పరమేశ్వరరావు, రాంకుమార్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలకు రెక్కలు



ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మార్కెట్లో కూరగాయల ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. నెల రోజుల్లో వీటి ధరలు ఒకటికి రెండు రెట్లు పెరిగాయని జనాలు చెబుతున్నారు. కొన్ని రకాల రేట్లు వింటేనే భయం వేస్తోంది. ఇలాగైతే జీవనం కష్టమని మహిళలు అంటున్నారు. కూరలు వండలేని వారు పచ్చడి మెతుకులతో సరిపెట్టుకోవాల్సిందే. గన్నవరం ప్రాంతంలో బీర, దోస, వంకాయ తోటలున్నాయి. వాటిల్లో పంట ఇప్పుడే సాగు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. విజయవాడ హనుమాన్ జంక్షన్ ఏరియా ల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకుంటున్నారు. చిత్రం ఏమంటే పది రూపాయలున్న సొరకాయ రేటు రూ.30కి పెరిగిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కొన్ని రకాల కూరగాయల రేట్లు వింటే భయం వేస్తోందని మహిళలు చెబుతున్నారు. ఈ రేట్లతో సామాన్యులు బతకడం కష్టమనే వాదన వినిపిస్తోంది. రేట్లు పరిశీలిస్తే... బీరకాయ కిలో 60, దోసకాయ కిలో 40, క్యారెట్ 80, వంకాయ కిలో 40రూపాయలు, బెండకాయ కిలో 40 రూపాయలు, టమాట కిలో 40, పచ్చిమిర్చి కిలో 100 ఈ విధంగా అన్ని కూరగాయల రేట్లు విపరీతంగా పెరిగాయి. రైతు బజార్లో కొద్దిగా ధరలు అందుబాటులో ఉన్నాయి. విజయవాడ మార్కెట్లో ధరలు పెరగడం వల్ల ఇక్కడ పెంచి అమ్మాల్సి వస్తుందని కొంతమంది వ్యాపారులు చెప్తున్నారు.

ఇవేం ధరలు బాబోయ్ : రాంబాబు, కేసరపల్లి

వంకాయలు కిలో రూ.40కి పెరగడంతో కూర వండలేని పరిస్థితి వచ్చింది. మిగిలిన కూరగాయలు కిలో 40 నుంచి 80 వరకు ధరలు పలకడంతో మరింత ఇబ్బంది అవుతుంది. సామాన్యులు కూరలు వండాలంటే ఆలోచించాల్సి వస్తుంది. ధరలు తగ్గితేనే వంకాయ కూరవండేది.

ధరలు ఎప్పుడు తగ్గుతాయో : శివాజీ, గన్నవరం,

భారీగా పెరిగిన కూరగాయల ధరలు పరేషాన్కి గురి చేస్తున్నాయి. చికెన్ రేటు కిలో 260 అమ్ముతుంటేనే అమ్మో అంటున్నాం. ఇప్పుడు కిలో క్యారెట్ రూ.30 నుంచి రూ.80కి పెరిగిం ది. బెండ, బీర రూ.40కి చేరింది. తోట కూర కట్ట రూ. 20, ఇలాగైతే పేదవాళ్లు జీవనం కష్టంగా మారుతుంది.

అధికారులు స్పందించాలి: బి.శ్రీను, గన్నవరం,

అధికారులు రంగంలో దిగి కూరగాయల రేట్లు తగ్గించాలి. రైతుల నుంచినేరుగా కొనుగోలు చేసి జనాలకు అందేలా చూడాలి. ప్రవేటు వ్యాపారుల వద్ద తగ్గేలా చర్యలు తీసుకోవాలి. పెరిగిన కూరగాయల ధరలతో భోజనం హెూటళ్లలో భోజనం రేటు రూ. 60 నుంచి రూ.100కి పెంచారు.

19న సుందరయ్య వర్ధంతి సభ

ప్రజాశక్తి - వీరులపాడు : వీరులపాడులో దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి, స్మారక స్థూపం ఆవిష్కరణ సందర్భంగా 19న సాయంత్రం ఐదు గంటలకు వీరులపాడు బస్టాండ్ సెంటర్లో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సిపిఎం మండల నాయకులు తెలిపారు. ఈ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు హాజరవుతారని తెలిపారు.

సబ్ జైల్‌ను సందర్శించిన జడ్జి

ప్రజాశక్తి - నందిగామ : కృష్ణాజిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ సంస్థ కార్యదర్శి కె.వి.రామకృష్ణయ్య, నందిగామ సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్ జడ్జి సత్య లక్ష్మి ప్రసన్న శనివారం నందిగామ సబ్ జైల్ సందర్శించారు. ఖైదీల వివరాలు, వారి యోగ క్షేమాలు తెలుసుకొని ఖైదీలకు వారి హక్కుల గురించి తెలిపారు. చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు, లైబ్రరీ సెక్రెటరీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ షేక్ ఆజాద్, సబ్ జైలు సూపరెన్టెంట్ పాల్గొన్నారు.

జవాన్లకు జోహార్లర్పిస్తూ ర్యాలీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఆపరేషన్ సిందూర్ విజయవంతం అవడంతో జాతీయ జెండాలను పట్టుకొని అమర జవాన్లకు జోహార్లు తెలియజేస్తూ శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య తిరంగా యాత్ర ర్యాలీ నిర్వహించారు. **ప్రజాశక్తి- నందిగామ :** శనివారం సాయంత్రం నందిగామ మండలం లింగాలపాడు గ్రామంలో టిడిపి, కూటమి నాయకులు కలిసి తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. **వీరులపాడు :** జయంతి గ్రామంలో జవాన్లకు జోహార్లర్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చిదిరాల భారత రెడ్డి మాట్లాడారు. ఎంపిడిఒ రాజు, ఇఒఆర్‌డి రామరాజు, మహాలక్ష్మి, గ్రామ కార్యదర్శి ఐవి. రామారావు,సచివాలయ సిబ్బంది,యువజన నాయకులు పాల్గొన్నారు.

గేదెలకు రేడియం స్టిక్ వేయాలి

ప్రజాశక్తి - తిరువూరు : గేదెల కొమ్ములకు రేడియం స్టిక్కరింగ్ కచ్చితంగా వేయించి రాత్రి వేళల్లో తిరిగే వాహనదారులను రోడ్డు ప్రమాదాల నుండి కాపాడాలని ఎస్ఐ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. తిరువూరు మండలం, లక్ష్మీపురం పాల శీతల కేంద్రంలో వివిధ గ్రామాల్లోని పాల కేంద్రాల సొసైటీ కార్యదర్శుల సమావేశం శనివారం జరిగింది. సొసైటీ కార్యదర్శి పాల కేంద్రాల్లో పాలుపోసే రైతుల గేదెలకు రేడియో స్టికరింగ్ వేయించే బాధ్యత తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ తెలిపారు. పోలీస్ ఉన్నతాధికారుల నుండి విజయ మిల్క్ డైరీ యాజమాన్యం ద్వారా కార్యదర్శుల సమావేశం నిర్వహించిన ఎస్ఐ పలు సూచనలు చేశారు. మేనేజర్ మూర్తి, ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ పల్నాటి సత్యనారాయణ, పెద్దవరం పాలకేంద్రం ప్రెసిడెంట్ గద్దె వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ, రస్నా పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పురపాలక సంఘ కమిషనర్ ఇ.వి.రమణ బాబు ఆధ్వర్యంలో వేసవి ఎద్దడి నివారణ కోసం శనివారం ప్రజలకు నందిగామ ఆర్‌డిఒ బాలకృష్ణ, నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, మున్సిపల్ కమిషనర్ రమణబాబు ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు మజ్జిగ, రస్నా పంపిణీ చేశారు. మెడికల్ క్యాంపు నిర్వహించారు. హాజరైన ప్రజలకు, వర్కర్లకు, సిబ్బంది అందరికీ ఓఆర్‌ఎస్ ప్యాకెట్స్, ఆరెంజ్ జ్యూస్, మ్యాంగో జ్యూస్‌లు పంపిణీ చేశారు. వేసవి ఎద్దడి కొరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నందిగామ పట్టణంలో పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.



వైద్య శిబిరంలో మజ్జి, ఓఆర్‌ఎస్ పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆటోనగర్ సమస్యలపై సిపిఎం ధర్నా

చెత్తను వెంటనే తొలగించాలి - పారిశుధ్యం మెరుగుపర్చాలని నేతల డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వీధివీధినా దర్శనమిస్తున్న చెత్త కుప్పలు, సుమారు 15 రోజులుగా పడకేసిన పారిశుధ్యంపై నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో ఆటోనగర్‌లోని సాయి హోటల్ సెంటర్‌లో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, సిపిఎం తూర్పు నగర కార్యదర్శి పుప్పాల కృష్ణ పాల్గొని మాట్లాడారు. జవహర్ ఆటోనగర్ ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడగా పేరుగాంచిందని, ఇందిరాగాంధీ చేతుల మీదుగా ప్రారంభమై ఇప్పుడు వేల సంఖ్యలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పడ్డాయని అన్నారు. లక్ష మంది కార్మికులు ఈ ప్రాంతంలో పనిచేస్తున్నారని, ఎంతో గొప్ప చరిత్ర కలిగిన ఆటో నగర్ ఇప్పుడు దౌర్భాగ్య పరిస్థితులను ఎదుర్కొంటుందన్నారు. సుమారు 1800 అసెస్మెంట్‌ల నుండి కోట్లలో పన్నులు వసూళ్ళు చేస్తున్నారనీ, ఎన్నికల ముందు ఆటోనగర్ అభివృద్ధే మా లక్ష్యం అని, వ్యాపారానికి, అభివద్ధికి ప్రాధాన్యత ఇస్తామని హామీలు ఇచ్చి నమ్మించారని అన్నారు. మురిగిపోయిన చెత్త వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తి కార్మికుల ఆరోగ్యాలను దెబ్బతీసే అవకాశం ఉందన్నారు. 1995-2000 సంవత్సరాల మధ్య అప్పటి కార్పొరేషన్ ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్లు నిర్మాణం చేసి ఐలా (లోకల్ అథారిటీకు) అప్పజెప్పారని అప్పటి నుండి జరిగిన అభివృద్ధి నామమాత్రమే అన్నారు. పారిశుధ్య పరిస్థితి క్షీణిస్తోందని, ఆటోనగర్‌లో మంచినీటి



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

సౌకర్యం లేదన్నారు. ప్రతిరోజూ సుమారు 50- నుండి 100- తాగునీటికి ఖర్చు చేయాల్సి వస్తుందని, వాటర్ ట్యాంక్ 2024లో కట్టి సంవత్సరాలు దాటుతున్నా ఇంతవరకు ప్రారంభోత్సవాల పేరిట చేయకుండా ఉన్నందున మంచినీటిని అందించలేకపోతున్నారని ఆరోపించారు. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స చేసేందుకు కూడా వైద్యశాల లేదు, అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళేందుకు కనీసం అత్యవసర అంబులెన్స్ సర్వీస్ కూడా లేదన్నారు. ఆటోనగర్‌లో పేరుకు పోయిన చెత్తను తక్షణమే తొలగించాలనీ,. కార్మికులు, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు టి.చంద్రశేఖర్, కోరాడ రమణ, నగర కమిటీ సభ్యులు ఎన్.నాగేశ్వరరావు, వి.బి.రాజు, వరప్రసాద్, గురుమూర్తి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీతో పాటు ఉపాధి కల్పనే ధ్యేయం : శారద యాజమాన్యం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యార్థులకు డిగ్రీతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా కోర్సులను రూపకల్పన చేస్తున్నట్లు శారద ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కుందా రామ నారాయణ అన్నారు. గాంధీనగర్‌లోని శారద డిగ్రీ కళాశాల విద్యార్థులకు లాంగ్ టర్మ్ ఇంటర్న్‌షిప్ పూర్తి చేసినందుకు విద్యార్థులకు శనివారం కళాశాలలో స్టైఫండ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిగ్రీ బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు స్టైఫండ్ చెక్ రూపంలో బెంగళూరుకు చెందిన ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ అందజేసింది. ఈ సందర్భంగా కుందా రామ నారాయణ మాట్లాడుతూ శారద డిగ్రీ కళాశాల డిగ్రీ కోర్సు పూర్తయ్యేలోగా ప్రతి విద్యార్థికి ఉద్యోగ అవకాశం కల్పించాలనే ధ్యేయంగా కృషి చేస్తుందని అన్నారు. ఇందులో భాగంగానే ప్రస్తుత పోటీ ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కోర్సు రూపకల్పన చేస్తున్నామని అన్నారు. విద్యార్థులకు కేవలం థియరీ క్లాస్ మాత్రమే కాకుండా ప్రాక్టికల్‌గా నాలెడ్జి అందించాలనే ఉద్దేశంతో వివిధ కార్పొరేట్ కంపెనీలతో భాగస్వామ్యం చేసుకుని విద్యార్థులకు చక్కని విద్యను అందిస్తున్నామని అన్నారు. బెంగుళూరుకు చెందిన ఎజెఎ ల్యాబ్స్ కంపెనీ



రాష్ట్రంలోనే తొలిసారిగా తమ కళాశాల విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో పాటు స్టైఫండ్ కూడా ఇస్తుందని తమ విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.8 వేలు అందిస్తుందన్నారు. మూడు నెలలకు సంబంధించిన స్టైఫండ్ ఇచ్చారని విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారని అన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో కూడా మరికొన్ని కంపెనీలు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఇవ్వనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శారద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగేశ్వర శర్మ, కరెస్పాండెంట్ ఎస్.ఎస్.వి.ప్రసాద్ విద్యార్థులకు చెక్‌లను అందజేశారు.

జావెద్ హబీబ్ సెలూన్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ నగరంలో ప్రముఖ హీరోయిన్ మోహరీన్ సందడి చేసింది. రామవరప్పాడు నూతనంగా ఏర్పాటు చేసిన జావెద్ హబీబ్ సెలూన్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రముఖ హెయిర్ స్టైలిష్ట్ జావెద్ హబీబ్ తో కలిసి శనివారం సాయంత్రం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం సెలూన్‌ను పరిశీలించి ఇక్కడ అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు అనంతరం హీరోయిన్ మోహరీన్ మాట్లాడుతూ నేటి తరం యువతి యువకులు అందానికి ప్రాధాన్యత ఇస్తున్నారని వారి అవసరాల నిమిత్తం ప్రముఖ జావెద్ హబీబ్ సెలూన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయం అని తెలిపారు. తాను కూడా హెయిర్‌కి ప్రాధాన్యత ఇస్తానని రకరకాల హెయిర్ స్టైలిష్ చేయించుకుంటానని చెప్పారు. విజయవాడ నగర ప్రజలకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ సాఫ్ట్ వేర్ ఉద్యోగాన్ని వదులుకుని జావెద్ హబీబ్ లాంటి సెలూన్ ను నిర్వాహకులు తన నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజలు బ్యూటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రముఖ హెయిర్ స్టైలిష్ట్ జావెద్ హబీబ్ మాట్లాడుతూ విజయవాడలో జావెద్ హబీబ్ 9వ సెలూన్ ప్రారంభించినట్లు తెలిపారుఉ. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల



సెలూన్‌ను ప్రారంభిస్తున్న మెహరీన్

జావెద్ హబీబ్ సేవలను విస్తరించనున్నట్లు తెలిపారు. అనంతరం రామవరప్పాడు జావెద్ హబీబ్ బ్రాంచ్ సెలూన్ నిర్వాహకురాలు మైనం వీణా మాట్లాడుతూ కరెన్సీ నగర్, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు ప్రాంతం ప్రజలకు బ్యూటీ సేవలను అందించేందుకు సెలూన్ ప్రారంభించినట్లు తెలిపారు. తమ వద్ద హెయిర్ కలరింగ్, పెడిక్యూర్ బ్రైడల్ మేకప్, మేని క్యూర్, హెయిర్ కటింగ్ తదితర సేవలు లభిస్తాయని తెలిపారు. హెయిర్ సెలూన్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని రకాల సేవలపై 30శాతం డిస్కౌంట్ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎయిర్సెల్ నిర్వాహకులు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా రహితంగా రెడ్డిగూడెం : తహశీల్దార్

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : నవోదయం 2.0లో భాగంగా రెడ్డిగూడెం మండలంలో నాటుసారాను తుడిచి పెట్టేందుకు ఏర్పడిన రెడ్డిగూడెం మండల కమిటీ సమావేశం తహశీల్దార్, రెడ్డిగూడెం వారి కార్యాలయంలో, వారి అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ మండలంలో నాటుసారా ప్రభావిత గ్రామాలైన రెడ్డిగూడెం, అన్నేరావుపేట, ఓబుళాపురం, రుద్రవరం, ముచ్చినపల్లి, మద్దులపర్వ గ్రామాల గ్రామ కమిటీలు ఆయా గ్రామాలను సారా రహిత గ్రామాలుగా తీర్మానాలు చేసిన దరిమిలా మండలంలో నాటుసారా ప్రభావంపై చర్చించి, మండలం మొత్తాన్ని నాటుసారా రహిత మండలంగా ప్రకటిస్తూ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో రెడ్డిగూడెం తహశీల్దార్ జె.సుశీల, ఎంపిడిఒ టికెవి.రమణ, ఎస్ఐ మోహన్‌రావు, ఎపిఎం వెలుగు రామకృష్ణ, ఇరిగేషన్ శాఖ ఎఇ విజయ కుమార్ పాల్గొన్నారని ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

సులభతరంగా దుర్గమ్మ దర్శనం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : సందర్శకులు, యాత్రికులందరికీ సులభతరంగా కనకదుర్గమ్మ దర్శనం ఏర్పాటు, ఆలయ భద్రత తదితర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రోటోకాల్ దర్శనాలు క్రమబద్ధం చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనానాయక్ ప్రకటించారు. ప్రస్తుతం వివిధ శాఖల, ప్రజా ప్రతినిధుల, అధికార వర్గాల నుండి వస్తున్న విన్నపాల ప్రకారం ప్రోటోకాల్ దర్శనాలు నడుస్తుండగా, వాటినే క్రమబద్ధం చేసేందుకు తాజాగా దేవస్థానం ఒక ఫార్మాట్ రూపొందించింది. దర్శనం కోరుకుంటున్న వారి పేరు, ఫోన్ నెంబర్, సభ్యుల సంఖ్య, వాహనం నెంబర్‌తో పాటు వారిని రికమెండ్ చేస్తున్నదెవరు, వారి హోదా (ప్రజా ప్రతినిధి, అధికారి), వారి ఫోన్ నెంబర్ ఇందులో ప్రధాన వివరాలుగా ఉన్నాయి. ఈ వివరాల వల్ల పారదర్శకత ఉంటుందని, ఆలయ భద్రత రీత్యా తప్పనిసరిగా ఈ విధానం అనుసరించాలని సిబ్బందికి శనివారం ఉదయం ఆదేశాలిచ్చారు. ఈ వివరాలతో వచ్చిన విన్నపాలలో స్థాయి ప్రకారం ప్రొటోకాల్ విభాగం పరిశీలించి దర్శనం ఏర్పాటు చూస్తారని కార్యనిర్వాహణాధికారి పేర్కొన్నారు.

వ్యవసాయ ప్రదర్శన

ప్రజాశక్తి - వత్సవాయి : వ్యవసాయం చాలా సంక్షోభంలో కూరుకుపోతుందని ప్రొఫెసర్, విభాగాధిపతి ఉద్యానవన శాస్త్రవేత్త వి.శ్రీలత అన్నారు. శనివారం అచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాల, బాపట్ల గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా వత్సవాయి మండలం మక్కపేటలో రైతు సదస్సు కార్యక్రమం, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ వి.శ్రీలత. (ప్రొఫెసర్, విభాగాధిపతి' ఉద్యానవన శాస్త్రం) మాట్లాడుతూ మిరపలో తామర పురుగులు నివారణ కొరకు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు సలహాలు పాటించడమే కాకుండా రైతులు కూడా సకాలంలో మందులు పిచికారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి, అయిన డాక్టర్ జి.శివ నారాయణ (విస్తరణ సంచాలకులు) మాట్లా డుతూ వ్యవసాయం చాలా సంక్షోభంలో ఉంది. కావున యువత వ్యవ సాయం పైన మొగ్గు చూపాలి. పంటతో పాటు పాడి ఉండాలని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం, గరికపాడు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.అచ్యుత రాజు మాట్లాడుతూ వ్యవసాయ వ్యవస్థాపకత పైనా విద్యార్థులకు మొగ్గు చూపాలని తెలిపారు.


పెడనలో...



కంకిపాడులో...


గుడివాడలో...

సైనికులకు మద్దతుగా ర్యాలీలు

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్: ఆపరేషన్ సింధూర్‌ను పురస్కరించుకొని సైనికులకు మద్దతుగా పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. పెడన బస్టాండ్ దగ్గర ఉన్న మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెడన బస్టాండ్ దగ్గర నుండి బంటుమిల్లి రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
కంకిపాడు: ఆపరేషన్ సింధూర్ విజయోత్సవం సందర్భంగా కానూరు వెలగపూడి స్టోరేజ్ నుంచి పోరంకి వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. చిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
గుడివాడ : త్రివిధ దళాలకు సంఘీభావంగా గుడివాడలో తిరంగా ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఆర్డిఓ జి.బాలసుబ్రమణ్యం, డీఎస్పీ ధీరజ్ వినీల్, అధికార ప్రముఖులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. 300 అడుగుల జాతీయ జెండాతో పురపాలక సంఘ కార్యాలయం వద్ద ప్రారంభమైన యాత్ర మార్కెట్ సెంటర్, వాసవి చౌక్, ఏజీకే స్కూల్ సెంటర్, నెహ్రూ చౌక్ సెంటర్ మీదుగా, తిరిగి మున్సిపల్ కార్యాలయం సెంటర్ కు చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ స్ఫూర్తితో గుడివాడలో వేలాది మందితో తిరంగా ర్యాలీ జరగడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, జిల్లా బిజెపి అధ్యక్షుడు గుత్తికొండ శ్రీ రాజా బాబు, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, సీనియర్ టిడిపి నాయకులు పిన్నమినేని బాబ్జి, డాక్టర్ గోర్జి సత్యనారాయణ, లింగం ప్రసాద్, పండ్రాజు సాంబయ్య, రూరల్ మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, నందివాడ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, తాసిల్దార్ రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉచిత నేత్ర వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు స్థానిక లయన్స్ సేవా భవనంలో శనివారం ఉచిత నేత్ర చికిత్స శిబిరాన్ని నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ తెలిపారు. లయన్ కొల్లి రాజేష్ ఆర్థిక వితరణతో నిర్వహించిన ఈ శిబిరంలో 15 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పెరుమాళ్ల, పి చిట్టిబాబు, సిహెచ్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

టిడిపి కమిటీల ఎన్నిక

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు మండలంలో వివిధ గ్రామాలకు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులను నియమించడం జరిగిందని గూడూరు మండల టిడిపి అధ్యక్షుడు స్వామి తెలిపారు. గూడూరు గ్రామ అధ్యక్షులుగా ఎన్‌ఎ భేగ్, నారికేదెలపాలెం అధ్యక్షులుగా కొప్పుల చినకాళి, కోకనారాయణపాలెం అధ్యక్షులుగా చోడగం బిక్షాలరావు, ఆకులమన్నాడు అధ్యక్షులుగా నాగిశెట్టి నాగబాబు, కప్పలదొడ్డి అధ్యక్షులుగా సుబ్బనాగన్న, పోసినవారిపాలెం అధ్యక్షులుగా సిరివెళ్ల సుబ్రహ్మణ్యం, కంకటావ అధ్యక్షులుగా వాకా శ్రీనివాసరావు, రామానుజవర్తర్లపల్లి అధ్యక్షులుగా పలగాని సుబ్రహ్మణ్యం, లేళ్లగరువు అధ్యక్షులుగా పుష్పల అశోక్ చక్రవర్తి, తుమ్మలపాలెం అధ్యక్షులుగా తోట వేణు, చిట్టిగూడూరు అధ్యక్షులుగా గౌరిపర్తి చంద్రశేఖర్ ఎన్నికయ్యారు.

వాకర్లకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం వాకర్లకు మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి ఎండలను దష్టిలో పెట్టుకుని దాతల సహకారంతో వాకర్లకు రెగ్యులర్‌గా మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరువీధి వెంకయ్య, ఇతరులు పాల్గొన్నారు.



చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-గన్నవరం: పిల్లలు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని స్టేట్ బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగి చిమట రామారావు అన్నారు. శనివారం గన్నవరం గ్రేడ్ వన్ గ్రంథాలయంలో పిల్లలకు ఇండోర్ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెస్, క్యారమ్స్, డ్రాయింగ్ వంటి పోటీల్లో పిల్లలకు తగిన విధంగా శిక్షణ ఇచ్చి వారిని శక్తివంతులుగా తయారు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.
గుడ్లవల్లేరు: విద్యార్థులకు పఠన సామర్థ్యం పెంపొందించుటకు పుస్తకాలు చదవాలని గ్రంథాలయ అధికారిని టి వాణి అన్నారు.వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రేడ్-2 శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు తెనాలి రామకృష్ణ కథలు పుస్తకాల్లో రామకృష్ణుడు గురించి చదివి వినిపించారు. అనంతరం క్యారమ్స్, లూటో, వైకుంఠపాళీ, క్రికెట్, వాలీబాల్ ఆటలు ఆడించారు.



గన్నవరంలో ఆటలు ఆడుతున్న చిన్నారులు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి : సిఐటియు


గన్నవరంలో...


చల్లపల్లిలో...

ప్రజాశక్తి-గన్నవరం: లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని కోరుతూ జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని గన్నవరం మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం సావరగూడెం గ్రామంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు పాలడుగు శ్రీమన్నారాయణ, కార్యదర్శి బత్తుల శ్రీనివాస్ రెడ్డి, అలాగే సావరగూడెం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గ్రామ కార్యదర్శి పసుమర్తి వీరాంజనేయులు, బోయిన జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి:** లేబర్ కోడ్స్‌కి వ్యతిరేకంగా నిర్వహించే కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు కొత్త మాజేరు గిడ్డంగుల వద్ద హమాలీలను సిఐటియు చల్లపల్లి మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల హమాలి ముఠా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ముత్యాల సూరిబాబు కలిసి కరప్రతాలు పంపిణీ చేశారు.

చేపల చెరువుగా మార్చొద్దని ధర్నా

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరు వడ్డు చెరువు పంట భూములను చేపల చేరువుగా మార్చటాన్ని నిరసిస్తూ శనివారం ధర్నా నిర్వహించారు. చేపల చెరువు తవ్వకాల వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్థానిక హరిజనవాడలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన ధర్నాలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి బాబూరావు, దావులూరి అజయాకర్ మాట్లాడుతూ గ్రామస్తులు అందరూ వ్యతిరేకిస్తున్నా రెవెన్యూ అధికారులు లెక్క చేయకపోతే పోరాటం ఉదతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలోగ్రామస్తులు దాసే నరసింహ, చిర్ల శ్రీకర్, మేడిపల్లి శ్యాం, ఎలికే అభిషేక్, చేబ్రోలు ఆనంద్ స్వరూప్, ఎమ్.శ్రీశ్యాం, తోటకుమార్, చేపల సొసైటీ అధ్యక్ష కార్యదర్సులు దావులూరి ప్రసాద్, చాట్ల దానియేలు పాల్గొన్నారు.



చలివేంద్రం ఏర్పాటు


ప్రజాశక్తి-కోడూరు: అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో కోడూరు వంతెన సెంటర్లో కోడూరు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శనివారం గ్రామ సర్పంచ్ వెన్నా షైనీ ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వంతెన సెంటర్లో నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుందని ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావు, పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, బండే శ్రీనివాసరావు, వెన్నా ప్రసాద్, పూతబోయిన శ్రీనివాసరావు, పిల్లి మల్లికార్జునరావు, వేములపల్లి రాజేష్ , ఆప్టికట్ల రవీంద్ర పాల్గొన్నారు.



దళిత గిరిజన హక్కుల పరిరక్షణ

గుడివాడ అధ్యక్షునిగా సురేష్

ప్రజాశక్తి-గుడివాడ : దళిత గిరిజన హక్కుల పరిరక్షణ సమితి గుడివాడ డివిజన్ అధ్యక్షులుగా కొమ్ముల సురేష్ నియమించినట్లు జిల్లా ఉపాధ్యక్షులు ఎకె ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దళిత గిరిజన సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ అధికారులతో సంప్రదిస్తూ పరిష్కారానికి కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. సమితి లీగల్ అడ్వయిజర్ ఆవుల ప్రవీణ్ కుమార్ నియామక పత్రం అందించిన వారిలో ఉన్నారు.



పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి-మోపిదేవి: పశు పోషకులకు ప్రభుత్వం రాయితీపై దాణా అందించడం వారికి ఎంతో మేలు కలుగుతుందని మోపిదేవి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధన్ రావు పేర్కొన్నారు. శనివారం మోపిదేవి మండలం పశు వైద్యశాల వద్ద 209 మంది రైతులకు 50 శాతం సబ్సిడీపై దాణా అందించారు. పెదకళ్ళేపల్లి పశువైద్యాధికారిణి డాక్టర్ గుల్జారు బేగం మాజీ సిడిసి చైర్మన్ రావి నాగేశ్వరరావు విజయ డైరీ పాలకేంద్రం అధ్యక్షుడు బొందలపాటి ప్రసాద్ తదితరులు దాణ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు భారత్ పశుగణన యాప్ లో నమోదైన పశుపోషకులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు తీసుకువచ్చి 1110 విలువచేసే దాణ బస్తాను 555 చెల్లించి తీసుకువెళ్లవచ్చని తెలిపారు.





ఎంఎల్ఎ వర్లను కలిసిన బండి రామకృష్ణ

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాను శనివారం మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ కష్ణా జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకష్ణ పామర్రు ఎమ్మెల్యే నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఇరువురు నాయకులు ఏకాంతంగా రాష్ట్ర రాజకీయాలపై కొద్దిసేపు ముచ్చటించారు. రైతులకు సేవ చేసే అవకాశం కూటమి ప్రభుత్వంలో రామకష్ణకు రావడం పట్ల వర్ల కుమార్ రాజా అభినందించారు. తన సహకారం ఎప్పుడూ ఉంటుందని రైతు సంక్షేమం కోసం కషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పామర్రు జనసేన పార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు నాయకులు కొండ మేస్త్రి, కోటి, మైఖేల్, కోన ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్, కుట్టు శిక్షణకు దరఖాస్తులు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో నిరుద్యోగ యువతి (మహిళలకు) ఉపాధికల్పించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఉమెన్స్ కాలేజీ నందిగామలో పది, ఇంటర్, డిగ్రీ అపైన అర్హత కల్గిన అభ్యర్థులకు ప్రత్యేకంగా 2 నెలలు పాటు డేటా ఎంట్రీ కోర్సులో ఉచిత శిక్షణకు ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ఎం.రమేష్ బాబు శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులకు ఎంపికైన యువతి (మహిళలకు) కుట్టు యంత్ర ఆపరేటర్, డేటా ఎంట్రీ కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాస్, గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ఎం.రమేష్ బాబు తెలిపారు. శిక్షణ అనంతరం ప్రముఖ్య సంస్థలో ఉద్యోగావకాశాలు , స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి కల్గి అర్హత గల 15 నుండి 45సంవత్సరాల వయసు గల నిరుద్యోగ యువతులు (మహిళలు), 30 లోపు నమోదు చేసుకోవాలని, కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు (ఎన్ఎస్‌డిసి అండ్ ఎంపికెవివై అండ్ ఎపిఎస్ఎస్‌డిసి) ద్వారా ధ్రువపత్రాలు అంద జేస్తామన్నారు. అభ్యర్థులు తమ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, ఈ మెయిల్ ఐడి, మొబైల్ నెంబర్‌తో గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఉమెన్స్ కాలేజీ నందిగామలో ఉదయం 10 గంటల సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 8919951682 నెంబరులతో సంప్రదించాలని గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ఎమ్.రమేష్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

అరెస్టులతో డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారు

వైసిపి రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - మైలవరం : ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, గత ప్రభుత్వ అధికారులను, వైసిపి నాయకులను వరస అరెస్టులు చేయిస్తూ డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని వైసిపి రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐఎఎస్ అధికారి ధనుంజయ్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ అధికారి కృష్ణమోహన్‌రెడ్డి అరెస్టును ఖండిస్తున్నామన్నారు. దాడులు, కేసులు, దౌర్జన్యాలతోనే ఈ ప్రభుత్వం సంవత్సర కాలం వెళ్లదీసిందని విమర్శించారు. ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని, సంక్షేమాన్ని గాలికొదిలేసి ప్రతిపక్షపార్టీపై, అధికారులపై వేధింపుల పర్వాన్ని ఇలానే కొనసాగిస్తే, వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి - వత్సవాయి : కిశోర బాలికల్లో రక్తహీనత లేకుండా చూసుకోవటం ముఖ్యమని ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీ భార్గవి అన్నారు. భీమవరం గ్రామంలోని కేంద్రాల్లో ఈశ్వరి వికాసంపై బాలికలకు అవగాహన కల్పించారు. సిడిపిఒ మాట్లాడుతూ యుక్త వయసు వచ్చిన బాలికలు ఎలా ఉండాలి. వారి సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా కిశోర బాలికలు పాలు, గుడ్లు, ఆకుకూరలు వంటివి ఎక్కువ తినడం అలవాటు చేసుకోవాలని సూచించారు. బాల్యవివాహాలు కారణంగా జరిగే అనర్థాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సూపర్వైజర్ల భాగ్యలక్ష్మి, బేబీ జానీ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఇబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తూనికలు కొలతలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ప్రపంచ మెట్రాలజీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సిమెంటు ఉత్పత్తి పరిశ్రమలలో పని చేస్తున్న కార్మికులు తూనికలు, కొలతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా తూనికలు కొలతల శాఖ సహాయకులు భాను ప్రసాద్ అన్నారు. ఈ నెల 20న జరిగే మెట్రాలజీ దినోత్సవం సందర్భంగా ముందుగా జగ్గయ్యపేటలో శనివారం కెసిపి సిమెంట్ కంపెనీలో కార్మికులకు, యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సులో భాను ప్రసాద్ మాట్లాడుతూ సిమెంట్ కంపెనీలో ఫిల్లింగ్ చేస్తున్నా సిమెంట్ బస్తాలు, నికర బరువు కలిగి ఉండాలని, తయారీదారుని పేరు చిరునామా, నికర బరువు, తయారు చేయబడిన తేదీ, ధరలు, కస్టమర్ కేర్ నెంబర్ ఆ పాకెట్లపై ఉండాలని లేని యెడల చట్టపరమైన కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. కెసిపి సిమెంట్ సంస్థ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : 50వ డివిజన్ స్వచ్ఛ సర్వేక్షణ్ భాగంగా వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల కోసం ప్రచారం నిర్వహించారు. 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు గొల్లపాలెం గట్టు ప్రాంతంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో ఎండ తీవ్రత వర్గాలకు త్వరగా శరీరంలో నీటి శాతం తగ్గి డీ హైడ్రేషన్‌కు లోనవడం జరుగుతుందని కావున తగినంత మంచినీరు, మజ్జిగ, పండ్లు, కాయలు చలువ చేసే పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎంఒహెచ్ అన్నపూర్ణ సానిటరీ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్, సచివాలయం సెక్రటరీలు వెంకటేశ్వరరావు, చంద్ర నాయక్, ప్రవీణ్, రాణి, ఆర్‌పిలు, మున్సిపల్ వర్కర్స్, స్థానిక పెద్దలు కె.గంగాధర్, తదితరులు పాల్గొన్నారు. ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల సన్నిధిలో శనివారం ఉదయం స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి అనుగుణంగా, పరిసరాలు స్వచ్ఛంగా ఉంచేందుకు గానూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి దేవస్థానం రాజగోపురం ముందు 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ' జరిగింది. కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీ కోటేశ్వరరావు, సహాయ కార్యనిర్వహణాధికారి ఎన్.రమేష్ బాబు ఆలయ సిబ్బందితో పరిసరాల శుభ్రత, ఆలయ స్వచ్ఛత గురించి అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆలయసేవలో భాగంగా వివిధ ప్రదేశాలు శుభ్రం చేయడం జరిగింది. **జగ్గయ్యపేట :** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'స్వచ్ఛ్ ఆంధ్ర స్వచ్ఛ్ దివస్ బీట్ ద హీట్' కార్యక్రమంలో జగ్గయ్యపేట ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) జగ్గయ్యపేట మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జగ్గయ్యపేట మునిసిపాలిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ 'శుభ్రమైన పరిసరాలే ఆరోగ్యానికి మూలం అన్నారు. వేసవిలో నీటి తగ్గుదల, కాలుష్యం మన ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా, నీటిని వృథా చేయకుండా, చెత్తను సరైన రీతిలో పారేయాలి. 'స్వచ్ఛ్ ఆంధ్ర స్వచ్ఛ దివస్' కార్యక్రమం ద్వారా అందరికీ ఈ విషయం తెలిసిపోవాలి. మన పిల్లలకు ఆరోగ్యమైన భవిష్యత్తును అందించేందుకు ఇది మొదటి అడుగు' అని తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, మన పరిసరాల పరిశుభ్రత ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. వేసవి కాలంలో నీటి కొరత, అధిక ఉష్ణోగ్రతల వల్ల కలిగే సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మున్సిపల్ అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా మునిసిపల్ సిబ్బంది, ప్రజలు, స్వచ్ఛంద వాలంటీర్లు అందరూ కలిసి నగరంలోని వివిధ ప్రాంతాల్లో శుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్, మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** డాక్టర్ నార్ల తాతారావు తాప విద్యుత్ కేంద్రంలో సిఎ, బి కాలనీలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఎపిజెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.యన్ చక్రధర బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన



50వ డివిజన్‌లో అవగాహన కల్పిస్తున్న సత్యబాబు

మాట్లాడుతూ దేశంలోనే మన రాష్ట్రాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు పరిశుభ్రత అనేది తమ తమ ఇంటినుంచి ప్రారంభించి తన చుట్టు పక్కల పారిశుధ్యం పరిశుభ్రంగా ఉంచితే పర్యావరణాన్ని పరిరక్షించిన వారమవుతామని తెలిపారు. ఈ నెలలో ప్రభుత్వం వారు హీట్ ది బీట్ అని కార్యక్రమాన్ని చేపట్టారని, అందులో భాగంగా మన కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమం రెండు చోట్ల చలివేంద్రాలు, నాలుగు కాలనీల్లో నీటిని వడిసి పట్టేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం అందరి చేత స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమ సంధాన కర్తగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సేఫ్టీ, ఎం.నాగబాబు వ్యవహరించారు. పర్యవేక్షక ఇంజనీర్లు, డిప్యూటీ సెక్రటరీ, జనరల్ మేనేజర్ (ఫైనాన్స్), అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ ఎగ్జిక్యూటివ్ అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు యూనియన్, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. **నందిగామ :** ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండల కృష్ణకుమారి పేర్కొన్నారు. శనివారం నందిగామలో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటిని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ప్రతి వ్యక్తి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రత పాటించినప్పుడే ప్రజలకు ఎటువంటి చర్మ వ్యాధులు, డయేరియా తదితర వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని తెలిపారు. నందిగామ తాసిల్దార్ సురేష్ బాబు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ ఏచూరి రాము, కార్యాలయ సిబ్బంది, మెప్మా విభాగపు సిటీ మిషన్ మేనేజర్, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు. **చందర్లపాడు :** చందర్లపాడు మండలంలోని మునగాలపల్లి గ్రామ పంచాయతీలో స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర ప్రోగ్రాంలో భాగంగా మే మాసంలో థీమ్-బీట్ ది హిట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్‌డబ్ల్యూపిసి ఏరియాలో మొక్కలు నాటడం, చలివేంద్రం ఏర్పాటు వృద్ధులకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగూరి వెంకటేశ్వరరావు డిప్యూటీ ఎంపిడిఒ పి.యేసుబాబు, పంచాయతీ కార్యదర్శి ఉన్నం హరీశ్ సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎడ్లపందేలు ప్రారంభించిన ఎస్ఐ అభిమన్య

కొనసాగుతున్నఎండ్ల పందేలు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం లింగాలపాడు గ్రామంలో శ్రీలక్ష్మి పేరంటాలు అమ్మవారి తిరుణాల సందర్భంగా శనివారం రాత్రి ఎడ్ల పందాల పోటీలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. శనివారం ఎడ్ల పందాలను నందిగామ ఎస్ఐ అభిమన్యు ప్రారంభించారు.

గ్రీవెన్స్ సెల్ అధ్యక్షునికి సన్మానం

ప్రజాశక్తి - నందిగామ : వైసిపి కార్యాలయంలో మాజీ ఎంఎల్ఎ డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావును జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు సటికం దుర్గాప్రసాద్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మొండితోక జగన్మోహన్‌రావు దుర్గాప్రసాద్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి గ్రివెన్స్ సెల్ విభాగం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నందిగామ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి - వత్సవాయి : జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం వత్సవాయి మండలం కంభంపాడులో నిర్వహించారు. వైద్య శిబిరంలో కంటి పరీక్షల్లో కంటి చూపు లోపం ఉన్న 82 మందికి కళ్ళజోళ్లను శనివారం జగ్గయ్యపేట నియోజకవర్గం సమన్వయ కమిటీ సభ్యులు నెట్టెం శివరాం, వైవిఎస్ రెడ్డి, లింగాల మాజీ సర్పంచ్ తొండపు జగన్ మోహన్ రావు, వత్సవాయి మండల పార్టీ అధ్యక్షులు శ్రీ వడ్లమూడి రాంబాబు, ఖమ్మంపాడు గ్రామ నాయకులు చెరుకూరు రమేష్, మాజీ ఎంపీటీసీ శాంతి బాబు ద్వారా కళ్ళజోడులను అందించారు. కంటి శుక్లాలు, పొరలు ఉన్నవారికి త్వరలో శంకర్ నేత్రాలయం విజయవాడలో ఆపరేషన్లు చేయించనున్నట్లు కోఆర్డినేటర్ కట్టవెంకట నరసింహారావు తెలిపారు.



19న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - వత్సవాయి : నియోజకవర్గ స్థాయిలో ప్రజల తమ సమస్యలను అర్జీలు ద్వారా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావచ్చని వత్సవాయి ఇన్చార్జి తహశీల్దార్ ప్రభు కుమార్ తెలిపారు. 12న జగ్గయ్యపేటలోని బి కన్వెన్షన్ కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నెరవేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం మూడు గంటల వరకు ఈ కార్యక్రమం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో నందిగామ ఆర్‌డిఒ కె.బాలకృష్ణ హాజరవుతున్నట్లు తెలిపారు.

ఎస్ఎంఎస్ఎ ఆధ్వర్యంలో మొక్కల పెంపకం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎస్ఏఎస్ఏ ఆధ్వర్యంలో మొక్కల పెంపకం కార్యక్రమం శనివారం గుంటుపల్లిలో చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం ఒక ప్రత్యేక థీమ్‌తో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విస్తృత ప్రజాప్రయోజన అభివృద్ధి కార్యక్రమం కోసం ఒక చెట్టును నరకడం తప్పనిసరైతే పది మొక్కలు నాటాలని సూచించారు. హరిత విస్తీర్ణాన్ని పెంచడం వల్ల మనకు, భావితరాలకు ఆరోగ్యకర జీవితం సొంతమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గుంటుపల్లి గ్రామ సర్పంచ్ బి.కవిత, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్‌సి డిసిడి - ఆర్‌బిఎస్‌కె డాక్టర్ జి.మాధవి నాయుడు, ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సయ్యద్ ఫర్వీన్, ఇబ్రహీంపట్నం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కెవిఎస్.నారాయణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు, ఇతర సెక్రటేరియట్ సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్డిగూడెం టిడిపి గ్రామ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం గ్రామ టిడిపి ఎన్నిక వివాదాల మధ్య జరిగింది. నూతన గ్రామ కమిటీని జానలపాటి వేణుగోపాల్ రెడ్డి ప్రకటించగానే అక్కడ కూడిన టిడిపి శ్రేణులు ఒక్కసారిగా రెండుగా విడిపోయి ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటూ గొడవపడ్డారు. కొంతసేపటికి ఒక వర్గం నిరసన వ్యక్తం చేస్తూ బయటకు వెళ్లగా మరో వర్గం వేణుగోపాల్‌రెడ్డి చదివి వినిపించిన ముగ్గురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. వారికి పసుపు కండువాలు కప్పి నాగేశ్వరరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. నూతన గ్రామ కమిటీ అధ్యక్షులు చాట్ల చందా, ఉపాధ్యక్షులుగా తొర్లపాటి సోమేశ్వరరావు, కార్యదర్శిగా దాసరి శివన్నారాయణను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలో గ్రేడ్ 1 శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా శనివారం ఉదయం 8 గంటలకు విద్యార్థులకు పుస్తక పఠనం చేయించారు. తదుపరి విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా బీట్ ద ఈట్ థీమ్ ఎండలను అధిగమించడం ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. తదుపరి విద్యార్థికి స్పోకెన్ ఇంగ్లీష్ ఆంగ్ల ఉపాధ్యాయులు వినోద్ బాబు వెర్బ్ ఫామ్ నేర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు ఆలేటి ప్రభ సిబ్బంది జె.శ్యామల రమేష్, రాము పాల్గొన్నారు.



బందరులో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిఆర్ఒ



గుడ్లవల్లేరులో చలివేంద్రం ప్రారంభం



మొవ్వలో మజ్జిగ పంపిణీ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్రలో డిఆర్ఒ చంద్రశేఖరరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖరరావు సూచించారు. స్వచ్ఛ ఆంధ్రస్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ ఆవరణలో డి ఆర్ ఓ ఉద్యోగులలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా వాతావరణంలో వచ్చే మార్పులను అధిక మించేందుకు మొక్కలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టిక్ వాడకం పెనుభూతం లాటిదని పర్యావరణానికి హని కలిగించే ప్లాస్టిక్ వాడకం నిషేధాన్ని గట్టిగా అమలు చేయాలని లేదంటే మన భావితరాలకు పెద్ద ముప్పు తప్పదని హెచ్చరించారు. జనవరి నుండి ప్రతినెలా మూడో శనివారం ఒక ఇతివత్తంతో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని ఈ నెల బీట్ ది హీట్ నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎండ వేడిమిని తట్టుకునేందుకు ప్రతిఒక్కరూ మొక్కలను పెంచాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిరీక్షణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ :** పౌష్టికాహారంపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి ఎ విజయఫ్లారెన్స్ అన్నారు. శనివారం గుడివాడ ప్రాజెక్టు పరిధిలోని గుడ్‌మెన్ పేటలో స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ఏరియాలోని తల్లులను అందరిని సమావేశపరచి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సిడిపివో విజయ ఫారెన్స్ మాట్లాడుతూ తడిచెత్త, పొడి చెత్త గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్స్ కెడికె భవాని, ఎబి ఆరీఫా, అంగన్‌వాడీ కార్యకర్తలు పి గీతాభవాని, సిహెచ్ వెస్లీనమ్మ, డిఎంకె కుమారి తదితరులు పాల్గొన్నారు. **మచిలీపట్నం అర్బన్:** ప్రజలలో పచ్చదనం, పరిశుభ్రత పట్ల అవగాహన పెంచడం కోసమే స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నరసింహులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలలో శుభ్రత పట్ల, పర్యావరణ పరిరక్షణ కొరకు, మానవ ఆరోగ్యం మెరుగుపరచడం కొరకు ప్రజలకు అవగాహన కల్పించి మంచి ఆరోగ్యవంతమైన జీవనం మనమందరం గడిపేందుకు దోహదపడుతుందన్నారు. 45 డివిజన్ టిడిపి ఇంచార్జ్ ఫణికుమార్ సహకారంతో మచిలీపట్నం పశువుల ఆసుపత్రిలోని పశువులకు తొట్టెలు నిర్మించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పశువుల ఆసుపత్రి డిప్యూటీ డైరెక్టర్ ఎస్.నాగభూషణం, సచివాలయ అడ్మిన్ షేక్ అల్లాబక్షు, డివిజన్ శానిటేషన్ మేస్త్రి బి. వి. రామశేఖర్ పాల్గొన్నారు. **అవనిగడ్డ:** మండల పరిధిలోని పులిగడ్డ గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం పరిసరాలను శుభ్రపరచడంతో పాటు స్వచ్ఛతలో ముందుగా ఉండే విధంగా ప్రతిజ్ఞ చేయించారు. వేసవికాలం సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదురుగా వాహనదారులకు 200 మందికి మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** ఎండలకు వడదెబ్బ తగలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో టీ విజయసారథి అన్నారు. 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా గుడ్లవల్లేరు, డోకిపర్రు, వడ్లమన్నాడు, కవుతరం, అంగలూరు, విన్నకోట గ్రామ పలు పంచాయితీల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. మండల కేంద్రమైన గుడ్లవల్లేరు లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో విజయ సారథి మాట్లాడుతూ ఎండ తీవ్రతకు ప్రజలు గురికాకుండా ఉండేందుకు చలివేంద్రం మరియు హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చలి వేంద్రం, ప్రధాన సెంటర్లోని బస్టాప్ వద్ద షామియానా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్లమన్నాడు గ్రామ సర్పంచ్ కటికల జ్యోతిలత, ఉప సర్పంచ్ రాంబాబు, గ్రామ కార్యదర్శులు ఏజేయల్ నరసింహారావు, బి.వి రమణ, ఎలీషా రావు, జయలక్ష్మి, ఈశ్వర కుమారి, సిహెచ్ రాజేష్, విజయ్ పాల్గొన్నారు. **మచిలీపట్నం రూరల్:** ప్రకతి ప్రసాదిస్తున్న నీటిని ఎక్కువగా వృథా చేస్తున్నామని, దానిని అరికట్టి నీటిని సంరక్షించుకోవాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ పిలుపునిచ్చారు. శనివారం విశ్వవిద్యాలయం లో నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్రా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలు ముఖ్యంగా యువత తమ కళ్లెదుట జరుగుతున్న వథాను అరికట్టడానికి బాధ్యతగా పనిచేయాలన్నారు. వర్షాకాలంలో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పదివేల మొక్కలు నాటాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు.ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష తదితరులు పాల్గొన్నారు. మచిలీపట్నం మండలం కానూరు పంచాయతీలోని పెదకానూరులోని పాటిమీద ఉన్న అంగన్వాడీ స్కూల్లో కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సెక్రెటరీ వెంకటేశ్వరరావు, పీత రాము ,బొమ్మిడి పెద ఏడుకొండలు,గోపు వెంకటరమణ పాల్గొన్నారు. **కంకిపాడు:** తాడిగడప పురపాలక పరిధిలో జరిగిన ర్యాలీలో శాసనసభ్యులు బోడే ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం బందర్ రోడ్డు తాడిగడప జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు.

మొవ్వ: మూడవ శనివారం సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో 'బీట్ బీ హీట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి అమర బాలేశ్వరరావు దంపతులు, వార్డు సభ్యులు కావూరి పూర్ణచంద్రశర్మ, కాకర్ల శ్రీనివాసరావు, కొడాలి రవి, పంచాయతీ కార్యదర్శి కె పుష్పనాదం, వీరంకి తులసీదాస్ పాల్గొన్నారు.



కంకిపాడులో...



బందరులో...



పెదకానూరులో...

కొలమాన శాస్త్రంపై అవగాహన



మాట్లాడుతున్న కృష్ణచైతన్య

ప్రజాశక్తి-చల్లపల్లి: ప్రపంచ కొలమాన దినోత్సవం ఆవశ్యకతను తెలియజేస్తూ చల్లపల్లి రైస్ అసోసియేషన్ మిల్లర్స్ ఆధ్వర్యంలో మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ లీగల్ మెట్రాలజీ డిపార్ట్మెంట్ డిప్యూటీ కంట్రోలర్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ కొలమాన దినోత్సవం రోజున, వినియోగదారులకు కొలమాన శాస్త్రం గురించి అవగాహన కల్పించడం, వారి హక్కులను పరిరక్షించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కొలమాన శాస్త్రం వినియోగదారుల జీవితంలో ఎలా ఉపయోగపడుతుంది, కొలమానంలో తప్పులు ఎలా ఉంటాయి, మరియు వారి హక్కులు ఏమిటి అనే విషయాలను వినియోగదారులకు తెలియజేయడానికి సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. కొలమాన శాస్త్రానికి సంబంధించిన వివిధ రకాల పరికరాలు సాంకేతిక పరిజ్ఞానాలను వివరించారు. ఎవరైనా స్థానిక కొలమాన శాఖ లేదా వినియోగదారుల వ్యవహారాల శాఖతో సంప్రదించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్రాలజీ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ కంట్రోలర్, టి. రామచంద్రన్, గుడివాడ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణరాజు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు వినియోగదారులు పాల్గొన్నారు.


కుట్టుమిషన్ శిక్షణ పరిశీలన

ప్రజాశక్తి-పమిడిముక్కల

వర్మీ కంపోస్ట్ తయారీ ప్రతి గ్రామంలో జరగాలని యుపిఆర్‌డి డి.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం పమిడిముక్కల సచివాలయంలో కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మూడో శనివారం స్వచ్ఛ కార్యక్రమాలపై మంటాడ, లంకపల్లి, కృష్ణాపురం గ్రామాల్లో పనులను ఆయన పరిశీలించారు. వేసవి కలంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ప్రసాద్, వరలక్ష్మి, స్వామి, అంగన్వాడి సిబ్బంది విజయనిర్మల, విజయ కుమారి, శాంతకుమారి, పరమేశ్వరి, చరిత్ర తదితరులు పాల్గొన్నారు.

మినీ మహానాడును విజయవంతం చేయాలి : బొబ్బా

ప్రజాశక్తి-అవనిగడ్డ: నియోజకవర్గ స్థాయిలో సోమవారం మోపిదేవిలో జరిగే మినీ మహానాడును జయప్రదం చేయాలని టిడిపి నియోజకవర్గ నాయకులు బొబ్బా గోవర్ధన్ పిలుపునిచ్చారు. శనివారం అవనిగడ్డ నియోజకవర్గం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోవర్ధన్ మాట్లాడారు. టిడిపి విజయం సాధించి కూటమి పార్టీలైన జనసేన బిజెపితో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత జరగనున్న తొలి మహానాడు కడపలో జరగనుండగా నియోజకవర్గం మోపిదేవిలు మినీ మహానాడు జరుపుతున్నట్లు తెలిపారు. వైసీపీ అరాచకాలకు ఎదురొడ్డి ఐదేళ్లపాటు పోరాటాలు చేసిన టిడిపి కార్యకర్తల తెగువకు స్ఫూర్తికి మోపిదేవిలో జరిగే మినీ మహానాడు వేదిక కాబోతుందని గోవర్ధన్ తెలిపారు చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల ఆదరవిమానాలు పొందుతుందని మినీ మహానాడు వేదికగా ప్రభుత్వానికి కార్యకర్తలంతా మద్దతుగా నిలవాలని గోవర్ధన్ కోరారు. 19వ తేదీన మోపిదేవి ఎస్ బీహార్ ఎదురుగా హైవేను అనుకొని ఉన్న స్థలంలో జరిగే మినీ మహానాడుకు ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు హాజరవుతారని ఆరు మండలాలకు చెందిన కార్యకర్తలు పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.





ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-మోపిదేవి: గ్రామీణ ప్రాంతమైన మోపిదేవి మండలం ఉత్తర చిరువోలు లంక గ్రామంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ మోపిదేవి మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు నడకుదుటి జననీకుమారి జనార్దన్ రావు దంపతుల సహకారంతో రేపల్లెకు చెందిన సాయి కంటి వైద్యశాల నిర్వహించిన శిబిరానికి గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. 60 మందికి కంటి పరీక్షలు చేయగా పదిమంది శుక్లాల ఆపరేషన్ నిమిత్తం ఎంపిక చేసినట్లు వైద్యులు అన్నే కిషోర్ బాబు తెలియజేశారు. ఆసుపత్రి సిబ్బంది సముద్రాల రాజేష్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. వేసవి కాలం పనులు లేని ఖాళీ రోజుల్లో ఈ క్యాంపు పెట్టడం ద్వారా కంటి ఆపరేషన్ చేసుకున్న వాళ్ల విశ్రాంతి తీసుకోవడానికి దోహదపడుతుందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

శ్మశానంలోకి చేపల చెరువు నీరు

గరికపర్రు గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: గరికపర్రు దక్షిణ దళితవాడ శ్మశాన వాటికను నీటితో ముంచేశారని గ్రామస్తులు శనివారం ఆందోళనకు దిగారు. గత వారం రోజులుగా చెరువులో చేపలు పట్టే నిమిత్తం చెరువు నీటిని మోటార్లతో తోడి శ్మశానవాటికలోకి వదులుతున్నారని దీంతో నీటితో నిండిపోయిందని గ్రామస్తులు ఆందోళన చెందారు. చెరువు యజమానులకు చెప్పినా పట్టించుకోకుండా తమ మనోభావాలు దెబ్బతినేలా శ్మశానవాటికలో నీరు వదలడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు ఖమ్మం కొండలుబాబు గ్రామస్తులకు మద్దతుగా నిలిచారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.



29 నుండి కృషి సంకల్ప్ అభియాన్ యాత్రలు

కెవికె సమన్వయకర్త డాక్టర్ కె.అచ్యుతరాజు



ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మే 29 నుండి జూన్ 12 వరకు కృషి సంకల్ప అభియాన్ యాత్రలు దేశవ్యాప్తంగా 700కి పైగా జిల్లాల్లో అభివృద్ధి చెందిన వ్యవసాయ సంకల్ప్ అభియాన్ యాత్రలు నిర్వహించబడునని కె.వి.కె సమన్వయకర్త డాక్టర్ కె.అచ్యుత రాజు తెలిపారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వర్చువల్ సమావేశంలో ఈ విషయాన్ని తెలియజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాస్త్రవేత్తలు గ్రామాలకు వెళ్లి రైతులతో సంభాషించి, అభివృద్ధి చెందిన వ్యవసాయం, రైతుల ప్రయోజనం కోసం రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత వ్యవసాయ పరిశోధన మండలి అభివృద్ధి చేసిన కృషి సంకల్ప్ అభియాన్ దేశవ్యాప్తంగా నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, మంత్రిత్వ శాఖ అధికారులు, ఉద్యోగులు, స్థానిక వ్యవసాయ కార్మికులతో బృందాలను ఏర్పాటు చేసి, ప్రతిరోజూ పలు గ్రామాలను సందర్శించి రైతులతో నేరుగా వారితో సంభాషించి వ్యవసాయం గురించి వారికి మరింత అవగాహన కల్పించి, వివిధ సలహాలు, సూచనలు అందజేస్తారన్నారు. ఈ కషి సంకల్ప్ అభియాన్ యాత్రలను మే 29 నుండి జూన్ 12 వరక ఎన్టీఆర్ జిల్లాలోని కృషి విజ్ఞాన కేంద్రం, అధికార పరిధిలో నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలతో పాటు భారత వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్తలు, వ్యవసాయ, అనుబంధ విభాగాల అధికారులు పాల్గొంటారని, రైతులు ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరం

ప్రజాశక్తి - తిరువూరు :

భారత రాజ్యాంగ లక్ష్యాలైన శాస్త్రీయ దృక్పథం, సమానత్వం, సోదర భావం వంటి వాటిని విద్యార్థుల్లో చిన్నతనం నుండే పెంపొదించడానికి జెవివి కృషి చేస్తుందని, ఇందుకు వేసవిలో ఉచిత శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తుందని జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ వి.రవీంద్ర తెలిపారు. తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో గత ఇరవై రోజుల నుండి నిర్వహించబడుతున్న ఉచిత వేసవి శిక్షణా శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఆటపాటలు నేర్చుకోవాలన్నారు. మూఢ నమ్మకాలకు దూరంగా ఉంటూ సైన్సు పట్ల అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక నైపుణ్యాలను, నాయకత్వ లక్షణాలను మెరుగుపర్చు కోవడానికి జెవివి శిక్షణ శిబిరాలు దోహద పడతాయని తెలిపారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిల్చిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా ఉపాధ్యక్షులు ఎం.హరికృష్ణ నాయకులు ఎం.రాంప్రదీప్, కె.పాపారావు, డి.సుదర్శన్, ఎం.సుధాకర్, ఎస్‌డి. సుభానీ, బి.సైదులు, ఎస్.జగన్మోహన్‌రావు, పి.శోభన్ బాబు, సురేంద్ర నాథ్, విజయ్ కుమార్, విజ్ఞాన కేంద్రం బాధ్యులు ఎం.నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ వి.రవీంద్ర

బీచ్ ఉత్సవాలు సరే... భారత్ సాల్ట్‌ను కాపాడండి...

సముద్ర తీర ప్రాంత అభివృద్ధికి ముఖ్యంగా తీరంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. దీనిలో భాగంగా విజయవాడతోపాటు రాష్ట్ర రాజధాని అమరావతికి ముఖద్వారంగా ఉండటమే కాకుండా హైదరాబాద్‌కు కొద్దిదూరంలో ఉన్న మచిలీపట్నం మంగినపూడి బీచ్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది జూన్ మొదటి వారంలో నాలుగు రోజులపాటు మసులా ఫెస్ట్ పేరుతో ఇక్కడ బీచ్ ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకుగాను కేంద్ర ప్రభుత్వ స్వదేశీ దర్శన్ పథకం కింద రూ.100 నుంచి 150 కోట్లు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపినట్లు ప్రకటించింది. ఈ ఉత్సవాలను విజయవంతం చేయడం ద్వారా మంగినపూడిని ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర ప్రకటించారు. అంతేగాక సముద్రతీరంలో పలు రకాల రిసార్టులు, హోటళ్లు పెట్టేందుకు రూ.800 కోట్ల నుండి రూ.1000 కోట్ల వరకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని మంత్రి చెబుతున్నారు. అయితే ప్రభుత్వాల విధానాల కారణంగా ఉన్న కొత్త పరిశ్రమలు రావడం, అభివృద్ధి చెందడం అటుంచి ఉన్న పరిశ్రమలే మూతపడే పరిస్థితి ఏర్పడుతోంది. కష్ణాజిల్లా మచిలీపట్నం రూరల్ మండలం పల్లె తుమ్మలపాలెం గ్రామంలో 25 ఏళ్లుగా నడుస్తున్న భారత్ సాల్ట్ కంపెనీ మూతపడే పరిస్థితికి వచ్చింది. సముద్రతీరంలో అత్యధికంగా 6,600 ఎకరాల్లో భారత్ సాల్ట్ కంపెనీ ఉప్పు ఉత్పత్తి చేస్తూ వస్తోంది. అయితే బందరు పోర్టు నిర్మాణం నేపథ్యంలో ఈ భూముల్లో మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు భూములను కేటాయించాలనే పేరుతో గత వైసిపి ప్రభుత్వం భారత్ సాల్ట్ భూముల లీజు గడువును పొడిగించలేదు. అంతేగాక మూడేళ్ల వ్యవధిలో మంగినపూడిలో గోదావరి సాల్ట్ కంపెనీకి చెందిన 560 ఎకరాలు, వనమిరెడ్డి వెంకటేశ్వర్లుకు చెందిన 338 ఎకరాలు, రోహిణికి చెందిన

7 వీక్షణం

నాలుగు ఎకరాలు, కృత్తివెన్ను మండలం చినపాండ్రేక ప్రాంతంలో ఇల్లూరి రాఘవయ్య కంపెనీకి చెందిన 60 ఎకరాలు, వనజ కుమారికి చెందిన 8 ఎకరాలు, ఉప్పాల రామకృష్ణ ప్రసాద్‌కు చెందిన 155 ఎకరాలు, శ్రీవాణికి 70 ఎకరాలు మొత్తం 7,795 ఎకరాల భూముల లీజును ప్రభుత్వం పునరుద్ధరించలేదు. దీంతో కృష్ణాజిల్లా మచిలీపట్నం, కృత్తివెన్ను మండలాల్లోని సముద్ర తీరప్రాంతాన 8,648.28 ఎకరాల సాల్ట్ భూముల్లో నాలుగేళ్ల క్రితం వరకు సగటున 3.15 లక్షల టన్నుల వరకు జరిగిన ఉప్పు ఉత్పత్తి గత మూడేళ్లుగా క్రమేణా తగ్గుతూ వస్తోంది. గత ఏడాది 1.40 లక్షల టన్నులకు ఉత్పత్తి పరిమితమైంది. ఈ ఏడాది ఎంవి సాల్ట్‌కు చెందిన 333.28 ఎకరాలు, ఎఎన్‌వివిఎస్ మూర్తి కంపెనీకి చెందిన 124 ఎకరాలు మొత్తం 457.28 ఎకరాల్లో మాత్రమే ఉప్పు ఉత్పత్తి పరిమితమైంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కేవలం వెయ్యి టన్నులు మాత్రమే ఉత్పత్తి వస్తుందని కేంద్ర ప్రభుత్వ సాల్ట్ కంపెనీ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఉప్పు ఉత్పత్తి నిలిచిపోయిన కారణంగా దీనిపై ఆధారపడి ఉపాధి పొందుతున్న మచిలీపట్నం మండలం పల్లెతుమ్మలపాలెం, పోలాటితిప్ప, కోన గ్రామాలకు చెందిన 2 వేలకుపైగా కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడింది. ఇక్కడ పనిచేసే వేలాది కార్మికులు ఉపాధిని కోల్పోయారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా భారత్ సాల్ట్ కంపెనీకి, ఇతరులకు ఇచ్చిన భూముల లీజు సంగతి తేల్చడంలేదు. దీంతో ఉప్పు ఉత్తత్పి పడిపోవడంతోపాటు వేలాది మంది ఉపాధి ఇంకా ఆగమ్యగోచరంగానే ఉంది. ఈ భూములు ఉప్పు ఉత్పత్తి తప్ప ఎందుకూ పనికిరావు. ఈకరణంగానే గతంలో ఇక్కడ పెట్రోలియం రిఫైనరీ పెట్టాలనే ఆలోచనను కూడా కేంద్ర ప్రభుత్వం విరమించుకుంది. అందువల్ల టిడిపి కూటమి ప్రభుత్వం భారత్ సాల్ట్ కంపెనీకి, ఇతరులకు మళ్లీ భూముల లీజును పునరుద్ధరించాలని ఎప్పుటి నుండో సిపిఎం, పలు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వెంటనే సాల్ట్ భూముల లీజును పునరుద్ధరించడం ద్వారా ఈ ప్రాంత ప్రజల ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాల్సిన అవసరం ఉంది.

- ఎం.బి.నాథన్

కొండపల్లి బొమ్మల ఖ్యాతి పెంచేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్

కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : దేశ, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు సాధించుకున్న కొండపల్లి బొమ్మ ఔన్నత్యాన్ని భావితరాలకు చాటి చెప్పేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌కు రూపకల్పన చేయనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. సెంటర్ ఏర్పాటుకు అవసరమైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొండపల్లిలో శనివారం పర్యాటక, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పలు సూచనలు చేశారు. పర్యాటకంగా జిల్లాను మరింత అభివవృద్ధి చేసేందుకు అపార అవకాశాలున్నాయన్నారు. చారిత్రక, సాంస్కృతిక ఔన్నత్యమున్న జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా ప్యాకేజీలకు కూడా రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా శతాబ్దాల చారిత్రక వారసత్వానికి సజీవ సాక్ష్యంగా ఉన్న కొండపల్లి బొమ్మ విశిష్టతను పర్యాటకులకు చాటి చెప్పేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో కొండపల్లి బొమ్మల విశిష్టతను తెలిపేలా అందమైన పెయింటింగ్స్‌తో ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలన్నారు. భవనంలో మౌలిక వసతులను అభివృద్ధి చేసి, సుందరీకరణతో ఆకర్షణీయంగా రూపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొండపల్లి బొమ్మ చారిత్రక వైభవం, బొమ్మల తయారీకి ఉపయోగించే తెల్ల పొణికి చెక్క ప్రాచుర్యాన్ని, బొమ్మలకు సంబంధించిన విశేషాలను పర్యాటకులకు కళ్లకు కట్టినట్లుగా తెలియజేసి ప్రత్యక్ష అనుభూతి పొందేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఇప్పటికే రూపొందించిన డిజైన్ ఆధారంగా ఎక్స్‌పీరియన్స్ సెంటర్ పనులు వేగవంతం చేయాలన్నారు. నగర పంచాయతీ అధికారులు పరిసరాలను పరిశుభ్ర పరచి శానిటేషన్‌ను మెరుగు పరచాలన్నారు. కొండపల్లి బొమ్మల కాలనీ నుండి ఖిల్లా వరకు పర్యాటకులు ట్రెక్కింగ్ నిర్వహించుకునేలా చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి త్వరితగతిన వినియోగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఏపి టూరిజం ఆథారిటీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ ఎస్.పద్మారాణి, టూరిజం కన్సల్‌టెంట్ సాహితి, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల గాంధీ, జిల్లా నాయకులు శ్రీకాంత్, కొండపల్లి జనసేన అధ్యక్షులు చెరుకుపల్లి సురేష్ పాల్గొన్నారు.



సెంటర్ ఏర్పాటు పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

లాబ్-గ్రోన్ వజ్రాభరణాల బ్రాండ్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వజ్రాభరణ రంగంలో తనదైన ముద్రవేసిన లాబ్-గ్రోన్ వజ్రా ఆభరణాల బ్రాండ్ స్టోర్ అయిన లాడియ విజయవాడ నగరంలో తన నాలుగో స్టోర్‌ను శనివారం లాంఛనంగా ప్రారంభించింది. ఈ స్టోర్‌ను ప్రముఖ నటి ఐశ్వర్య రాజేష్ ప్రారంభించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఆభరణం అందాన్ని మరింత పెంచుతుందనీ, ఇప్పుడు ప్రతి ఒక్కరు ఆభరణాలను తమకు కావాల్సిన డిజైన్‌లో చేయించుకుంటున్నారనీ అన్నారు. డైమండ్ వినియోగం చాలా పెరిగిందనీ, కొనుగోలు దారుల ఆలోచనలకు అనుగుణంగా లాడియ స్టోర్స్ విభిన్నమైన డిజైన్స్ అందిస్తుందన్నారు. తనకు బంగారు వజ్ర ఆభరణాలు అంటే ఎంతో మక్కువ అని, నేడు ఈ స్టోర్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. విజయవాడ అంటే కూడా తనకు చాలా ఇష్టమని, తనకు ఇష్టమైన విజయవాడ నగరానికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం లాడియ డైరెక్టర్ అఖిల్ వేములూరి, సాత్విక వేములూరి మాట్లాడుతూ విభిన్నమైన డిజైన్స్ అందించడానికి తాము ముందు ఉన్నామని అన్నారు. హారమ్‌లు, వడ్డాణాలు, నెక్లెస్‌లు, గాజులు, పెండెంట్లు, కంకణాలు, చెవిపోగులు, పోల్కీలు ప్రత్యేకంగా ఇస్తున్నామన్నారు. లాడియాలో స్వంత



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఐశ్వర్య, లాడియా డైరెక్టర్, అఖిల్ సాత్విక

నచ్చిన డిజైన్‌ను తయారు చేసుకోవచ్చని అన్నారు. డైమండ్ గ్రేడింగ్‌లో సర్టిఫికేషన్‌లో గ్లోబల్ అథారిటీ అయిన ఐజిఐ నుండి ధృవపత్రాలున్నాయని అన్నారు. క్యారెట్ డైమండ్ ధర రూ.24,999 (ఇఫ్‌వివిఎస్) నుండి ప్రారంభమై విభిన్న కలెక్షన్ల శ్రేణిలో లభిస్తుందన్నారు. మే 17 నుండి మే 25, 2025 వరకు డైమండ్స్, మేకింగ్ ఛార్జీలపై ఫ్లాట్ 15శాతం తగ్గింపు, ఎటువంటి వృథా లేకుండా ప్రత్యేకమైన ప్రారంభ ఆఫర్‌ను లాడియ అందిస్తున్నట్లు స్పష్టం చేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :

:డాక్టర్ మోహన్‌రావు మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్, కొండపల్లిలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత వైద్య శిబిరం కృష్ణ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు డాక్టర్ మామిడి శీతారామారావు, డాక్టర్ రత్నమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్ ఆర్థోపెడిక్, పల్మోనాలజీ సంబంధించిన ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ క్యాంపులో అన్ని రకాల ఎక్స్‌రే రక్త పరీక్షలపై 50 శాతం డిస్కౌంట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో ఇసిజి, బిపి, ఆర్‌బిఎస్, బిఎండి, పిఎఫ్‌టి పరీక్షలు ఉచితంగా చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సదవకాశాన్ని కొండపల్లి, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.